తిరుపతి - చిత్తూరు
30 ఏళ్ళ ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026
తెలుగు జాతీయ దినపత్రిక వార్త

# మంగంపేట మిల్లర్లు...మూడు ముక్కలు!



రైల్వే కోడూరు, మే 22 ప్రభాతవార్త : మంగంపేట సి. అండ్ డి. ముగ్గురాయిని అతి తక్కువ ధరకు సుమారు 60లక్షల టన్నులు దోసుకోవడమే కాకుండా మంగంపేట గనులు అభివృద్ధి కోసం ఉన్న స్థిర, చరాస్థులను దారదత్తం చేసి జీవనోపాధి కోసం ముగ్గు రాయి మిల్లులను నిర్మించుకున్నారు. వాటికి కూడా సి. అండ్ డి. ముగ్గురాయిని కొనుగోలుకు అందకుండా చేయడమే కాకుండా, మిల్లుల యజమానుల మధ్య కాసులు ఎరచూపి, మంగంపేటలో ఎంతో కాలం నుంచి మూడు పువ్వులు ఆరు కాయలుగా వున్న యజమానుల బంధాన్ని మూడు ముక్కలు చేయడంలో, వ్యాపారల వ్యధ ఏమిటో అంతు బట్టడం లేదు. వ్యాపార రీత్యా ముగ్గురాయి కోసం కొంతమంది అధికారులు మంగంపేటకు వచ్చి ఇక్కడున్న మిల్లుల యజమానులతో కలిసి వ్యాపారం చేయాల్సి వుంది. అలాంటిది మా మధ్య విబేధాలూ పెట్టి ఐక్యంగా వున్న మమళ్ళలను, మూడు ముక్కలు చేయడంలో వ్యాపారు ఒప్పందం అంతు బట్టడం లేదని నాయకులు తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. శుక్రవారం నాయకులు మూకుమ్మడి గా మాట్లాడుతూ, ముగ్గురాయిని ఉన్న ధరకంటే రు.500లకు తక్కువ కొనుగోలు చేయడమే కాకుండా, మా మధ్యే వివాదాలకు పురిగొలపడంలో కక్ష సాధింపు చర్య ఏమిటో అంతు బట్టడం లేదన్నారు. ఇంత కాలం విభేదించిన వ్యాపారులు, కొంతమంది మిల్లులు యజమానులు, టిప్పర్ల, మిషన్ల యజమానులు మాకు వ్యతిరేకంగా శుక్రవారం ఐక్యమై మాట్లాడుతున్నారంటే సంస్థ అధికారులకు ఎమి ముట్టిందో తెలియాలన్నారు. గత మూడు రోజుల క్రితం ధర్నా చేసిన వాళ్లందరం ఏకమై మా వంతు కృషితో అక్రమార్కులను, సంస్థను భవిష్యత్ తరాల కోసం ఎలా కాపాడుకోవాలో చూస్తామన్నారు. సిఅండ్డి ముగ్గురాయి టన్ను ధర రు.1680లు ఉంటే, కంపెనీకి రు.1180లకే టన్ను ముగ్గురాయి విక్రయించడంలో సంస్థకు వచ్చే వేల కోట్ల నష్టం ఎంత అని అంటున్నారు. స్థానికంగా గనులను నమ్ముకొని మిల్లులు కట్టుకున్న 165 మిల్లులకు దత్తపుత్రునికి తగ్గించిన రు.500ల టన్ను ధరను పెంచి రు.1680.లకే విక్రయించెదని, ఇష్టమైతే కొనండి లేదంటే వదిలేయండి అని సంస్థకు చెప్పకనే చెబుతున్నారు. అయితే ఇక్కడ ఉన్న కార్మిక సంఘాలు, రాటు తేలిన మిల్లుల యజమానులు ఉండగా మంచి జరగడం అనుకున్నంత సులభతరం కాదు.

# నేడు యాదమరికి...ముఖ్యమంత్రి రాక



సిఎం పర్యటన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ దూడి

చిత్తూరు, మే 22 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం పూతలపట్టు నియోజకవర్గం యాదమరి మండలంలో పర్యటించ నున్నారు. సిఎం చంద్రబాబునాయుడు శనివారం ఉదయం 9 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి నివాసం నుండి హెలికాప్టర్లో బయలుదేరి యాదమరి మండలం 14 కండ్రిగ గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు ఉదయం 11 గంటలకు చేరుకుంటారు. అనంతరం సిఎం ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమావేశమై ఉదయం 11.15 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు హెలిప్యాడ్‌కు సమీపంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక వద్ద నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1.35 గంటలకు యాదమరి సంతగేటు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సిఎం సందర్శించి రోగులు, వైద్య సిబ్బందితో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 2.20 గంటల నుండి సిఎం నారా చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ సభ్యుల సమావేశంలో పాల్గొని సాయంత్రం 4 గంటలకు హెలికాప్టర్లో బయలుదేరి సాయంత్రం 6 గంటలకు ఉండవల్లిలోని ఆయన నివాసంకు చేరుకుంటారు.

**సిఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు : ఎస్పీ తుషార్**

సిఎం చంద్రబాబునాయుడు శనివారం యాదమరి పర్యటన పురస్కరించుకుని పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిందని ఎస్పీ తుషార్ దూడి పేర్కొన్నారు. సిఎం పర్యటన పురస్కరించుకుని పోలీసుశాఖ శుక్రవారం ట్రయల్ రన్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ దూడి కాన్వాయ్ విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. చిన్నరెడ్డిపల్లి బస్‌స్టాప్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుండి సభా ప్రాంగణం, హెల్త్‌కేర్ సెంటర్ వరకు ట్రయల్ రన్ నిర్వహించి, కాన్వాయ్ సిబ్బంది యొక్క విధులు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణపై తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పీ అవగాహన కల్పించారు. కాన్వాయ్‌లో విధులు నిర్వహించే ప్రతి డ్రైవర్, రోప్‌పార్టీ, పైలట్ వాహన సిబ్బంది అత్యంత అప్రమత్తంగా, సమన్వయంతో వ్యవహరించాలన్నారు. డ్రైవర్లు వాహనాల మధ్య తగిన దూరం ప్రాటిస్తూ నిర్ణీత వేగపరిమితితోనే ప్రయాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ డాక్టర్ తరుణ్ పహ్వా, ఎఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, ఏఆర్ ఎఎస్పీ దేవదాస్, చిత్తూరు డిఎస్పీ వెంకట నారాయణ, పోలీసు అధికారులు, ఫైర్ అధికారులు, తహసిల్దారు పార్థసారధి, ఎంపిడిఓ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ హడల్ !

**చలానాల బాదుడుతోనే సరి - గగ్గోలుపెడుతున్న ఆటోవాలాలు**



ప్రభాతవార్త-తిరుపతి:

తిరుపతి నగరంలో ట్రాఫిక్ పోలీసులంటే వాహనదారులేగాక ఆటోవాలాలు కూడా హడలిపోతున్నారు. సమయం సందర్భంగా లేకుండా ఎక్కడ బడితే అక్కడ ఇష్టానుసారంగా ట్రాఫిక్ పోలీసులు చేతిలోని సెల్‌ఫోన్లతో ఫోటోలు తీసేసి ఈ చలానాలు సృష్టిస్తుండటంతో వాహనదారులకు భారంగా మారింది. ఏదేని అత్యవసరాల్లో రోడ్డుపక్కన నిలిపి ఫోన్‌మాట్లాడినా...లేకుంటే అడ్డదిడ్డంగా ఉన్న ట్రాఫిక్‌నుండి కొంత దూరంగా వెళ్లాలనుకుని ఓవర్‌టేక్ చేసినా ఠపీమని సెల్‌ఫోన్‌కు మెసేజ్‌రూపంలో చలానాలు బాధేస్తున్నారు. ఇదేదో డబ్బున్న వాడికైతే పరువా లేదుగానీ సామాన్యవ్యక్తిపై చలానాలు బాదేస్తుండటంతో ట్రాఫిక్ పోలీసులంటే జనం హడలిపోయే పరిస్థితి ఉంది. ఆటోవాలాలు ఎవరైనా అత్యవసరంగా చేయి ఎత్తినా ఆటో ఆపితే,లేకుండా ఆర్టీసి బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ఆటోలు ఆపి యాత్రికులను క్రిందకు దించే సమయాల్లో నిబధనలు విరుద్ధంగా ఉందంటూ ట్రాఫిక్ పోలీసులు మొబైల్‌ఫోన్‌లో ఫోటోతీసి ఈ చలానాలు పెట్టేస్తున్నారు. దీంతో సామాన్యవ్యక్తులు బండి ఆపాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉంది. ఇక ఆటోడ్రైవర్లు పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు ఉచిత బస్సులతో జనం ఆటోలపై ఆధారపడటం తగ్గిపోయింది. ఆపై అసలే డీజిల్ ధరలు పెరిగి ఆటోలు నడవక అంతంత మాత్రంగా బాడుగలు దొరుకుతున్నా ఏకంగా ఒక్కోసారి ఈ చలానాలను వెయ్యి రూపాయల నుండి 1,500రూపాయలవరకు వాయించేస్తున్నారు. ఇదంతా ఆటోడ్రైవర్ కడుపుఘోష మాత్రం ట్రాఫిక్ పోలీసులకు పట్టడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తిరుపతిలో ఆటోడ్రైవర్లుప్రధానంగా యాత్రికులు, ప్రయాణీకులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. దాదాపు ఆరువేలపైగా ఆటోలు ఉన్నాయంటే తిరుపతిలో యాత్రికులపై ఆధారపడి ఉన్నవారే. తిరుపతిలో దాదాపు ఆర్టీసి బస్టాండ్, రైల్వేస్టేషన్, తీర్థకట్టవీధి, గాంధీరోడ్డు, బజారువీధి,కర్నాలవీధి, ఇసుకవీధి, బండ్లవీధి,పెద్దకాపువీధులు అరకొర రోడ్లతో వెడల్పులేక అవస్థలు పడుతున్నారు. ఆటోలు ఎక్కడ ఆపినా వెంటనే ట్రాఫిక్ పోలీసులు తమకు టార్గెట్ విధించారంటూ ఆటోవాలాలపై చలానాల బాదుడు మోపుతున్నారు. ఒక ఆటోడ్రైవర్‌కు వరుసగా రెండు రోజుల వ్యవధిలోనే 2,500 రూపాయలు ఈ చలానాలు రాయడమంటే వారి బ్రతుకుతెరువు ఎలా ఉంటుందో పోలీసు అధికారులు మానవతా ధోరణితో ఆలోచన చేయాల్సి ఉంది. ప్రస్తుతం పోలీసులకు నెలవారీ వేతనంగా 60వేల రూపాయలవరకు అందుకుంటున్నారు. అయినా చాలావరకు కొందరు పోలీసులు తమ పాత అలవాట్లు మానుకోలేదు. ఇదే కోణంలో ఆటోడ్రైవర్లు పరిస్థితిపై ఆలోచన చేస్తే ఆటోడ్రైవర్లు జీవనంపై భారం పడదని పలువురు డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. తిరుపతిలో ప్రధాన ప్రాంతాల్లో,ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించి, ట్రాఫిక్‌ను ఒక గాడిలో పెట్టాల్సిన పోలీసులు అసలు విషయం గాలికొదిలేసి చలానాలు బాదుడుపై దృష్టి పెట్టడం మాత్రం బాధాకరం. ఇప్పటికే మందుతాగి వాహనం నడిపితే 10వేల రూపాయలు జరిమానా చెల్లించుకోవాల్సి వస్తోంది. ఇదీ తెలిసి చేస్తున్న నేరమే. కానీ టార్గెట్‌ల పేరుతో ట్రాఫిక్ పోలీసులు వాహనదారుల పైనేగాక ఆటోవాలాలపై ఈ చలానాల బాదుడు భరించలేకపోతున్నారు. పోలీసు అధికారులు చలానాల బాదుడుపై కొంత మానవతాదృక్పథంతో ఆలోచన చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

# భక్తుల రద్దీ నిర్వహణకు పకడ్బందీ చర్యలు

**-అదనపు ఈఓ, జిల్లా ఎస్పీ సంయుక్త తనిఖీలు**



తిరుమలలోని క్యూలైన్లు, ట్రాఫిక్, భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను తనిఖీ చేస్తున్న ఎఇఓ, జిల్లా ఎస్పీ

తిరుమల,మే 22ప్రభాతవార్తప్రతినిధి: వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో భారీగా పెరిగిన భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టిటిడి అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బారాయుడుతో కలిసి శుక్రవారం సాయంత్రం తిరుమలలోని దర్శన క్యూలైన్లు, ట్రాఫిక్, భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను తనిఖీ చేశారు. టిటిడి కల్పిస్తున్న సౌకర్యాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం క్యూలైన్లలో భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ, తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియా తో మాట్లాడుతూ భక్తుల రద్దీ పరిస్థితిని నిరంతరం సమీక్షి స్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ, టీటీడీ విజిలెన్స్, ఇతర విభాగాలు సమన్వయంతో 24 /7 పాటు ఆకుంఠిత దీక్ష తో పనిచేస్తున్నాయని చెప్పారు. క్యూలైన్లలో భక్తులను క్రమబద్ధంగా పంపిస్తూ తొక్కిసలాటలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బందికి ప్రత్యేక సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. శుక్రవారం అత్యధిక సంఖ్యలో వాహనాలు తిరుమలకు వచ్చినప్పటికీ, ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. టిటిడి ఆధ్వర్యంలో 320కు పైగా ఉచిత బస్సు సర్వీసులు నడుపుతున్నామని, అదనంగా ఏపీఎస్ఆర్టీసీ ద్వారా మరో 100కు పైగా ట్రిప్పులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. క్యూలైన్లలో భక్తులకు తాగునీరు, అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగను నిరంతరాయంగా అందిస్తున్నామని చెప్పారు. రోజుకు సుమారు నాలుగు లక్షల మందికి సరిపడా అన్నప్రసాదాలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే డయల్100, టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని భక్తులకు సూచించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ ఈఓలు లోకనాథం, రాజేంద్ర, సోమన్నారాయణ, ఇఇ శ్రీనివాస్, వీజీవో సురేంద్ర, ఆరోగ్యఅధికారిణి డాక్టర్ సుధారాణి, ఇతర




# అన్ని సేవలు ఆన్‌లైన్లోనే!

**-కోట్లు వెచ్చించి నిర్మించిన సెంట్రల్ బుకింగ్ కౌంటర్లు నిరుపయోగమేనా?**

శ్రీకాళహస్తి,మే 22 ప్రభాతవార్త: రాష్ట్రదేవాదాయశాఖ తీరు రోజు రోజుకు తీసికట్టుగా మారుతుంది. రోజుకొక నిర్ణయంతో దేవాలయాలకు సంబంధించిన కోట్లు నిధులు బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారింది. ముఖ్యంగా శ్రీకాళహస్తీశ్వ రాలయంలో కోట్లు నిధులు వృధా అయ్యాయని చెప్పవచ్చు. రాష్ట్ర దేవాదాయశాఖ ప్రస్తుతం శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన సేవలు, పూజలు,అభిషేకాలు అన్నీ ఆన్‌లైన్ చేసారు. అయితే సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న తరుణంలో 'ఆన్‌లైన్' చేయటం అభినందనీయమే. ప్రస్తుతం ఇక్కడ సేవా టిక్కెట్ల కౌంటర్లను యూనియన్ బ్యాంకు నిర్వహిస్తుంది. క్యూ ఆర్ స్కానర్ల బాధ్యతను కరూర్ వైశ్యాబ్యాంకు మరో బ్యాంకు విజయా బ్యాంకు, ఇండియన్ బ్యాంకుకు అవకాశం కల్పించారు. కౌంటర్లలో సుమారు 50 మంది పని చేస్తున్నారు. కొత్త నిర్ణయంతో ఇక్కడ పని చేసే ఉద్యోగులు ఇంటికి వెళ్ళాల్సిందే.



నూతనంగా నిర్మించిన సేవ టిక్కెట్ల కౌంటర్లు

**దశల వారిగా అమలుకు సిఎం ఆదేశం:**

రాష్ట్రంలోని దేవాలయాల్లో పారదర్శకత కోసం అవినీతి ఆరోపణలకు చెక్ పెట్టడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయి ఆన్‌లైన్ ప్రాజెక్టులుగా శ్రీకాళహస్తి,అన్నవరంలను ఎంపిక చేసారు. అయితే భక్తులకు అలవాటు అయ్యే లోపల దశల వారిగా అమలుకు నిర్ణయించారు. ఈనేపథ్యంలో శ్రీకాళహస్తి ఆలయంలో అప్పుడే అమలుకు రాష్ట్రదేవాదాయశాఖ ఆదేశాలతో పరుగులు తీయిస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వ రాలయంలో ఇప్పటికే అన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాలు అమలు జరుగుతున్నాయి. దాంతో ఇక్కడి అధికారులు ఆన్‌లైన్లో బుక్ చేసుకోకుండా వచ్చిన భక్తులకు ఆఫ్‌లైన్‌లో అవకాశం కల్పిస్తున్నారు. ప్రస్తుతం అంతా అన్‌లైన్ అనటంతో కొంత గందరగోళంగా మారింది. భక్తులకు విషయం తెలియకపోవటంతో తిప్పట తప్పటం లేదు. భక్తుల సౌకర్యార్థం అడుగడుగునా క్యూఆర్ స్కానర్లను 30 ఏర్పాటుకు ఆదేశించారు. వీటిని ఆర్‌టిసి బస్టాండు, రైల్వేస్టేషన్లలో ఏర్పాటుకు సన్నిద్ధమౌతున్నారు.

**ముందస్తు సమాచారం లేకుండా:**

ఏ పథకమైనా అమలు చేసేముందు నిర్ణయం తీసుకున్నపై స్థాయి నాయకుడు కానీ అధికారి కానీ విస్తృతంగా ప్రచారం చేయాలి లేదా. అవగాహన కల్పించిన, తరువాత అమలు చేస్తే సత్ఫలితాలువస్తాయి. అలా కాకుండా తన మదిలో వచ్చిన ఆలోచనలను వెనువెంటనే అమలు చేయమంటే అధికారులకు ముచ్చెమటలు పడుతున్నాయి. పై అధికారులు,నాయకుల నిర్ణయాల మేరకు స్థానిక అధికారులైనా, మీడియా ద్వారా భక్తులకు పూర్తి సమాచారం ఇవ్వాల్సి ఉంది. కానీ ఎలాంటి సమాచారం లేకుండా నిర్ణయాల అమలు అంటే స్థానికంగా సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

**కోట్లు వెచ్చించి నిర్మించిన కౌంటర్ల మాటేమిటు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రికి ముందు అంటే నాలుగు నెలల ముందు సుమారు రూ.2కోట్లు వెచ్చించి సెంట్రల్ కౌంటర్లను ఒకే చోట ఏర్పాటు చేసారు. దేవస్థానం సొమ్ములు వెచ్చించారు.అయితే వాటిని ఏం చేస్తారంటే వాటిని హెల్పింగ్ సెంటర్లుగా ఉపయోగించుకోనున్నట్లు సమాచారం.అయితే ఆన్‌లైన్ విధానం ఎలా అమలు చేస్తారనేది భక్తులకు అర్థం కాని సమస్యగా మారింది.ఒక వేళ ఆన్‌లైన్‌లో నెట్ పని చేయకుంటే పరిస్థితి ఏమిటనేది భక్తులకు ఆలయాధికారులు అవగాహనకల్పించాల్సి ఉంది. ఏదీ ఏమైనా అన్‌లైన్‌కు సంబంధించి భక్తుల్లో పూర్తి స్థాయి అవగాహన కల్గించే వరకు ఆఫ్‌లైన్ కూడ అమలు చేయాల్సి ఉందనే వాదన ఉంది.ఈ అంశాలకు సంబంధించి సిబ్బందికే అవగాహన లేదు.ఈ అంశానికి సంబంధించి పూర్తి స్థాయిలో భక్తులకు అవగాహనకల్పించాల్సి ఉంది.






# రైతుల పక్షపాతి సిఎం చంద్రబాబు

## - భూముల రీసర్వేతో రైతులకు న్యాయం
## - ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం, మే 22 ప్రభాతవార్త:**



రాష్ట్రంలో ఉన్న రైతుల పక్షపాతి సిఎం చంద్రబాబు నాయుడు అని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సజ్జలపల్లి రెవెన్యూ మదనాపురం గ్రామంలో జరిగిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సజ్జలపల్లి రెవెన్యూలో ఉన్న 64మంది రైతులకు చెందిన 99 ఎకరాల డికెటి భూములను గత ప్రభుత్వ హయాంలో కంగుంది ఆర్ఎఫ్‌లోకి అడవి పొరంబోకు భూములుగా రికార్డులు మార్చారన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఈ సమస్యలు పరిష్కరించబడ్డాయన్నారు. రైతులకు చెందిన భూములను రీ సర్వే చేయి ంచడంతో పాటు డిజిటల్ పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కుప్పం ప్రాంతంలో రైతుల అభ్యున్నతికి 3700కోట్ల వ్యయంతో శ్రీశైలం నుంచి కుప్పానికి కృష్ణా జలాలను సిఎం చంద్రబాబు తీసుకువచ్చారన్నారు. ఇప్పటికే 150 దాకా చెరువులు నిండాయన్నారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులు కృష్ణానీటితో నిండేలా సిఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, టిటిడి డైరెక్టర్ వైద్యం శా ంతారాం, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్,జిల్లా అధికార ప్రతినిధి సాంబశివం, కాణిపాకం బోర్డు సభ్యురాలు వసంతమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, కో ఇన్‌చార్జ్ గాయత్రి, ప్రధాన కార్యదర్శి ధనశేఖర్, తహశీల్దార్ చిట్టిబాబు, పిఎసిఎస్ ఛైర్మన్ కృష్ణమూర్తి, సాగునీటి సంఘం ఛైర్మన్ బగ్గిడి వెంకటేష్, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజ్, నేతలు సంతోష్, రామచంద్ర,చంద్రయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలి

**రామకుప్పం, మే 22 ప్రభాతవార్త:**

మండలంలోని గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ ఈశ్వరయ్య సూచించారు. శుక్రవారం వీర్నమల, విజలాపురం పంచాయతీల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నీటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అలాగే గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణ చేపట్టాలన్నారు. సచివాలయ ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉ ండాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

**రామకుప్పం, మే 22 ప్రభాతవార్త:**

మండలంలో ఖాళీగా ఉన్న 19 అంగన్‌వాడీ ఆయాల పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ కల్పన తెలిపారు. ఈనెల 23నుంచి జూన్ 6వరకు దరఖాస్తులు అందించాలన్నారు. వివరాలకు ఐసిడిఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## కలసికట్టుగా పార్టీ బలోపేతంకు కృషి

**గుడిపాల, మే 22 ప్రభాతవార్త:**




మండల పరిధిలో తెలుగుదేశం నాయకులు కలసికట్టుగా పార్టీ బలోపేతంకు కృషి చేయాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. మండల మాజీ పార్టీ ఉపాధ్యక్షులు అనిల్‌ఖుమార్ జన్మదిన వేడుకలు శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు, ఆయన తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడులు అనిల్‌కుమార్ దంపతులను సన్మానించి కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేసి పార్టీ నిర్ణయించిన అభ్యర్థులు విజయం సాధించేలా కృషి చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. నాయకుల మధ్య ఎలాంటి విబేధాలు లేకుండా అందరు కలసికట్టుగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు, ఎంపిపి హరిప్రసాద్ చౌదరి, మాజీ కార్పొరేటర్ కోలా కిరణ్, తెలుగు దేశం నాయకులు కాజూరు బాలాజీ, సింగిల్‌విండో అధ్యక్షులు ప్రతాప్‌నాయుడు, మాజీ జడ్పీటిసీ బాలాజీ నాయుడు, జనసేన అధ్యక్షులు రూప్‌కుమార్, మాజీ సర్పంచ్ గోవిందగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ చిత్తూరు లక్ష్యంగా విధులు : ఎమ్మెల్యే గురజాల

**చిత్తూరు, మే 22 ప్రభాతవార్త:**



స్వర్ణ ఆంధ్రా-స్వచ్ఛ ఆంధ్ర స్ఫూర్తితో స్వర్ణ చిత్తూరు-స్వచ్ఛ చిత్తూరు లక్ష్యంతో ప్రతి ఒక్కరు విధులు నిర్వర్తించాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ నెల రోజుల ప్రత్యేక కార్యక్రమంను శుక్రవారం చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫారెస్ట్ రోడ్డు గంగినేనిచెరువు కట్ట వద్ద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్డుకు ఇరువైపుల వున్న పరిసరాలను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్‌లు స్థానిక నాయకులతో కలిసి చీపరు పట్టి స్వయంగా శుభ్రం చేశారు. ఈ క్రమంలో రోడ్డు ప్రక్కన వున్న వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం చెత్త తరలించే వాహనాల్లో వ్యర్థాలను వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి సిఎం నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని, స్వచ్ఛ సర్వేక్షణ్, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలతో పల్లెలు, పట్టణాలను పరిశుభ్రంగా వుంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ సిఎంటి త్యాగరాజన్, మాజీ మేయర్ అముద, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు దగ్ధమైన మామిడి తోట!

**ఓబులవారిపల్లి, 22 మే ప్రభాతవార్త :**



ఓబులవారిపల్లి మండలం బొమ్మ వరం రెవెన్యూ పొలాలలో దళిత నాయకులు సమతా సైనిక్ దళ్ అధ్యక్షులు చౌడవరం సుబ్బ నరస య్య పంట పొలాలలో గుర్తు తెలి యని వ్యక్తులు నిప్పండించడంతో డ్రిప్పులు, మామిడి చెట్లు మరియు టేక్ సీట్లు మంచినీరు పైపులైను అగ్నికి దగ్ధమైనాయి. ఈ ప్రమాదాన్ని తెలుసుకున్న సిపిఐ నాయకులు జ్యోతి చిన్నయ్య దార్ల నాగేశ్వరరావు మరి కొంతమంది జిల్లా నాయకులు పంట పొలాల వద్దకు వెళ్లి పరిశీలించారు. పొలం యజమాని సుబ్బ నరసయ్యను పరామర్శించారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని అలాగే ఇంతవరకు ఎటువంటి మండల అధికారులు వ్యవసాయ అధికారులు పరిశీలించలేదని వారు మండిపడ్డారు. ఎప్పటికైనా అగ్ని ప్రమాదం ఎలా జరిగింది? వాటిపైన పరిశీలించి చట్టబద్ధమైన చర్యలు తీసుకొని ఇలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని వారు అధికారులు కోరారు.

## విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి!

**పెద్దపంజాణి మే22 ప్రభాతవార్త:**



మండలంలోని పెద్దపంజాణి గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు పోలీసులు తెలిపినమేరకు వివరాలిలా గ్రామానికి చెందిన కుమ్మరి రామచంద్రయ్య కుమారుడు శివకుమార్ (47) చెరువుకట్టకింద కీలేరులో వరిపంట కోతకోసేందుకు వరికోత యంత్రాన్ని తీసుకెళ్ళాడు. వరికోత కోస్తున్న సమయంలో బోరు మోటారుకు లాగిన విద్యుత్ వైర్లు వరికోత యంత్రానికి అడ్డురావడంతో విద్యుత్‌వైర్లను పైకిఎత్తే క్రమంలో విద్యుత్ షాక్‌తగిలి శివకుమార్ అక్కడికక్కడే కుప్పకూలాడు. గమనించిన స్థానికులు వెంటనే పెద్దపంజాణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి శివకుమార్ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. శివకుమార్ భార్య వరలక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా శివకుమార్‌కు ఇద్దరు అమ్మాయిలు,ఒక అబ్బాయి సంతానం కలరు. రైతు శివకుమార్ మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

## గణనాధుడిని దర్శించుకున్న మాజీ మంత్రి

**కాణిపాకం, మే 22 ప్రభాతవార్త:**



రాష్ట్ర మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు కుటుంబసమేతంగా శుక్రవారం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి దేవస్థానం ఇఓ పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామి వారి సేవలో పాల్గొన్నారు. అలాగే శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం, నగగ్రహ ఆలయంలో సైతం వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి వేద మండపంలో ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలు, చిత్రపటంను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రొటోకాల్ ఎఇఓ ధనపాల్, సూపరిటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు పొదుపు అలవరచుకోవాలి

**తవణంపల్లి, మే 22 ప్రభాతవార్త:**



బాలికలు చిన్నప్పటి నుండి పొదుపును అలవర్చుకుని భవిష్యత్తు లక్ష్యాలు ఆర్థిక ప్రణాళికలతో ముందుకు సాగాలని ఐరాల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ నిర్మల అన్నారు. కిషోర వికాశం వేసవి క్యాంపులో భాగంగా శుక్రవారం కాణిపాకం పట్నం సచివాలయ పరిధిలోని బాలికలకు ఆర్థిక నిర్వహణ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15-18 సంవత్సరాల్లోపు బాలబాలికలు డబ్బు గురించి అర్థం చేసుకోవడం, డబ్బు అవసరాలు, కోరికలు, పొదుపు అవసరాలు, డబ్బును తెలివిగా ఖర్చు చేయడం, నగదు లావాదేవిలు సురక్షితంగా ఎలా నిర్వహించడం అని అవగాహన కల్పించారు. అలాగే బాల్య వివాహాల గురించి, రక్తహీనత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరత్నం, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

**పెనుమూరు, మే 22 ప్రభాతవార్త:**



గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపిడిఓ నీలకంఠేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉగ్రాణంపల్లి గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను ఎంపిడిఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చెత్తకు ఎక్కడ పడితే అక్కడ పడవేయరాదని, ఇంటి వద్దనే తడి, పొడి చెత్తను వేరు చేసి వుంచాలన్నారు. పారిశుధ్య కార్మికులు ఇళ్ళ నుండి చెత్తను సేకరించి చెత్త కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. గ్రామ కార్యదర్శులు ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శించి పారిశుధ్యం మెరుగు పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లోనే ఉత్తమ విద్య

**బంగారుపాళ్యం, మే 22 ప్రభాతవార్త:**



ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉత్తమ విద్య అందిస్తున్నామని డాక్టర్ కలికిరి మురళీమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ క్లాస్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు ఎంతో బలోపేతం అయ్యాయన్నారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన మేరకు ప్రతి విద్యార్థికి తల్లికి వందనం ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన అందించాలనే లక్ష్యంతో మంచి ఉపాధ్యాయ బృందంను ప్రభుత్వం నియమించడం జరిగిందన్నారు. ఈ ఏడాది టెన్త్ పరీక్షా ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్, మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌పి ధరణి, జనార్దన్‌గౌడ్, ఎంఇఓలు నాగేశ్వరరావు, రమేష్‌బాబు, తహసిల్దారు షబ్బీర్‌భాషా, ఎంపిడిఓ మహేష్‌బాబు, టిడిపి నాయకులు ఎన్‌పి జయప్రకాష్, జయచంద్రనాయుడు, కోకా ప్రకాష్‌నాయుడు, లోకనాధనాయుడు, హేమచంద్ర, హరిప్రసాద్, జాకీర్, నాసిర్‌ఖాన్, కోదండయాదవ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## చంద్రబాబు చిత్రపటానికి మహిళలచే పాలాభిషేకం

**కుప్పం, మే 22 ప్రభాతవార్త :**



మండలంలోని మదనపురం గ్రామంలో శుక్రవారం మహిళలు సిఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మహిళలకు ప్రభుత్వ పథకాల్లో పెద్దపీట వేయడంతో పాటు తమ భూముల సమస్యల పరిష్కారంకు సిఎం చంద్రబాబు చర్యలు చేపట్టడంతో వారు సంతోష ంగా సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మహిళలకు సూపర్ సిక్స్ పథకాలు అయిన తల్లికివందనం, స్త్రీశక్తి, దీపం 2 తదితర పథకాల్లో లబ్ది కలిగిస్తున్నారన్నారు. దీనికితోడు మహిళల అభ్యున్నతికి డ్వాక్రా సంఘాల ద్వారా రుణాల మంజూరు, కడ ద్వారా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారని మహిళలు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం,పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, కో ఇన్‌చార్జ్ గాయత్రి, కాణిపాకం బోర్డు సభ్యురాలు వసంతమ్మ, మహిళలు పాల్గొన్నారు.

## 55లక్షలతో చెరువు సుందరీకరణకు భూమిపూజ

**కుప్పం, మే 22 ప్రభాతవార్త:**



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో మండలంలోని దాసేగానూరు చెరువును 55లక్షలతో సుందరీకరణ పనులకు శుక్రవారం ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కుప్పం - కంగుంది మార్గంలో ఉన్న దాసేగానూరు చెరువు సుందరీకరణతో ఈమార్గంలో పర్యాటకులు మరింత పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే కుప్పం చెరువు సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. వాకింగ్ ట్రాక్, ఆధునాతన మొక్కలు వంటివి ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం,జిల్లా అధికార ప్రతినిధి సాంబశివం, క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, కో క్లస్టర్ గాయ త్రి, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, ఐటిడిపి అధ్యక్షుడు గుణశేఖర్, ఎఎంసి డైరెక్టర్ సుబ్బు, మైనార్టీ నేత అక మ్రల్, స్థానిక నేతలు వెంకటాచలంగౌడు, అశోక్, రామచంద్ర, చంద్ర, ధనశేఖర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి!

**కుప్పం, మే 22 ప్రభాతవార్త:**



గత పదిహేను రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని సిఐ మల్లేష్ యాదవ్ తెలిపారు. పదిహేను రోజుల క్రితం స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద సుమారు 60-65 ఏళ్ల వయసు గల వృదు ్ధడు అపస్మారక స్థితిలో పడి ఉండగాస్థానికులు కుప్పం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారన్నారు. ఇతను గురువారంమృతి చెందాడన్నారు. మృతుడ్ని గుర్తించిన వారు సిఐ 9440796737, ఎఎస్సై 9494696209, హెడ్‌కానిస్టేబుల్ 9390709191 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సిఐ కోరారు.

## మున్సిపల్‌ఛైర్మన్‌చే డ్రైన్ల నిర్మాణం పరిశీలన

**కుప్పం, మే 22 ప్రభాతవార్త:**



మున్సిపల్ పరిధి తంబిగానిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మురుగునీటి కాలువల నిర్మాణ పనులను మున్సిపల్ ఛైర్మన్ సెల్వ రాజ్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో మున్సిపాలిటీలో అవసరమైన చోట్ల సిసి రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నామన్నారు. పనుల్లో నాణ్యత ఉండాలని కాంట్రాక్టర్లకు సూచిం చారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు పెద్దపీట వేస్తున్నామన్నారు.

## పంటలపై ఏనుగుల గుంపు దాడి

**రామకుప్పం, మే 22 ప్రభాతవార్త :**



మండలంలోని రామాపురం తాండా, పిఎంకె తాండా ప్రాంతాల్లో ఏనుగుల గుంపు పంటలపై దాడులు చేసింది. గురువారం రాత్రి గ్రామ సమీపంలోని మామిడి చెట్లను నేలకూల్చడంతో పాటు వరి పంటను తొక్కేశాయి. వ్యవసాయ పరికరాలను చిందరవందర చేశాయని రైతులు వాపోయారు. రైతులు తమకు పంటనష్టం ఇప్పించడంతో పాటు ఏనుగుల దాడుల నిరోధానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పూతలపట్టులో గంగమ్మ జాతర

**పూతలపట్టు, మే 22, ప్రభాతవార్త**



పూతలపట్టులో నడివీధి గంగమ్మ నిమజ్జన మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆదర్శమూర్తి వైఎస్ఆర్సిపి రాష్ట్ర మేధావులు కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి దార్శనిక నాయకత్వంలో జరిగిన ఈ జాతర సంప్రదాయానికి, సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. పూతలపట్టు పురవీధి సంబరాల జాలతో పులకించిపోయింది. ఉదయం 6 గంటల నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నడివీధి గంగమ్మను నవరత్నాల నగలు, సుగంధ పరిమళాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. విద్యుత్ దీప ప్రభల వెలుగు జిలుగుల కాంతులతో అమ్మవారు దివ్య తేజస్సుతో దర్శనమిచ్చారు. నిలువెత్తు కటౌట్లు దీపాలంకరణతో దేదీప్యమాన తేజమూర్తిగా నిలిచి కరుణా కటాక్షంతో దీవించినట్టు భక్తులు భావించారు. చూపరుల మదిలో భక్తి జ్యోతి వెలిగింది. ఈ జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల కోలాటం, జానపద పాటల సందడితో తెలుగింటి సంస్కృతి పురవీధుల్లో ఉట్టిపడింది. పంబల నాదం, పిల్లనగ్రోవి రాగం, తాళం, నాగసరం, మంగళ వాయిద్యాల మేళవింపుతో పూతలపట్టు మార్మోగింది. శ్రావణ మాసపు ఆనందం ప్రతి గుండెలో నిండింది. డప్పుల మోతకు ఊరువాడ దద్దరిల్లింది. సాయంత్రం ఆకాశం నుంచి అమ్మవారి ఆశీస్సులా కత్తిరించిన రంగు కాగితాల వర్షం కురిపించారు. ఈ జాతర కులమత భేదం లేకుండా ఊరంతా ఏకమైన వేడుకగా నిలిచింది. జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా వేడుక ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రముఖులు ఆనగల్లు మునిరత్నం భీమేశ్వర ఆలయ ధర్మకర్త మల్లికార్జున శెట్టి ఉప సర్పంచులు వెంకటరమణారెడ్డి బాబు రెడ్డి అనే లోకనాథ్ రెడ్డి నరోత్తమ రెడ్డి ఉమాపతి రెడ్డి ముని రాజేంద్ర గుప్త గ్రామస్తులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : ముక్కా

రైల్వేకోడూరు రూరల్, మే 22 ప్రభాతవార్త



రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రతి శుక్రవారం టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని టిడిపి ఇన్చార్జి ముక్కా రూపానంద రెడ్డి అన్నారు. రైల్వే కోడూరు మండల పరిధిలోని రాఘవరాజుపురంలో టిడిపి కార్యాలయంలో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐదు మండలాల్లోని తమ సమస్యలను రూపానందరెడ్డికి విన్నతి పత్ర రూపంలో ప్రజలు అందజేశారు. ఇందులో ముఖ్యంగా రెవెన్యూ, విద్యుత్‌శాఖకు సంబంధించి సమస్యలు ఉత్పన్నం కాగా వాటిని చరవాణి ద్వారా సంబంధిత అధికారులతో చర్చించి బాధితుల సమస్యలను సాధ్యమైన మేర పరిష్కారం చూపాలని అధికారులకు రూపానందరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు టీవీ రమణరెడ్డి, వెంకట్రామరాజు, గడిగోడ సుబ్బరాయుడు, మద్దిన గిరిధర్ నాయుడు, చంద్రశేఖర్ రాజు, పోకల మణి, తమ్మిద తిరుపాల్ వేణుగోపాల్ రెడ్డి, తాళ్లపాక చిన్న, తిప్పన రాజశేఖర్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ యజమానులు నిష్పక్షపాతముగా నిజాయితీగా..

ముగ్గురాయి లోడింగ్ చేస్తున్నారు
-మిషన్ యజమానుల ఓనర్ గునిపాటి

**ఓబులవారిపల్లి, 22 మే ప్రభాతవార్త:**



ఏపీఎండిసి పరిధిలో కొన్ని ముగ్గురాయి వ్యాపారాల ఎక్స్పోర్ట్ కంపెనీలకు అనుసంధానంగా మిషన్ లోడింగ్ వ్యవహారంలో విధులలో నిష్పరక్షపాతంగా నిజాయితీగా పనులు చేపడుతున్నామని యజమానుల సంఘం నాయకులు మరియు ఓనర్ గునిపాటి చిన్నరాయుడు అన్నారు. శ్రీనిధి ఎంటర్ప్రైజెస్ కంపెనీ ద్వారా ఎటువంటి అవినీతి జరగకుండా నిబంధనల ప్రకారం విధులు చేపడుతున్నారని మా మిషనులే డ్రైవర్లు సూపర్వైజర్లు ఎక్కడ ఎటువంటి తప్పులు చేయలేదని చేయరని కొందరు కార్మిక నాయకులు మిషన్ల యజమానులు దొంగలు అనడం సబబు కాదని ఆయన ఖండించారు ఇకపై ఇలాంటి మాటలు మాట్లాడకుండా పునర్ ఆలోచన చేయాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు

## అసత్య ఆరోపణలు చేయడం తగదు

-మిషన్ యజమానుల సంఘం అధ్యక్షులు నాయకులు నవీన్ కుమార్

**ఓబులవారిపల్లి, 22 మే ప్రభాతవార్త :**



మంగంపేట ఏపీఎండిసి పరిధిలో కొన్ని ప్రైవేటు కంపెనీలకు సంబంధించి ఓ ఎక్స్పోర్ట్ కంపెనీలో పనిచేస్తున్న మిషన్ యజమానులను డ్రైవర్లను కొంతమంది కార్మిక నాయకులు దొంగలుగా చిత్రీకరించి అసత్య ఆరోపణలు అని అన్నారు. యజమానుల సంఘం అధ్యక్షులు కవులూరు నవీన్ కుమార్‌రెడ్డి లారీ అసోసియేషన్ అధ్యక్షులు గుణిపాటి చెన్నకేశవులు మాట్లాడుతూ అన్ని విధాల ఎక్కడా ఎటువంటి తప్పులు జరగకుండా నిబంధనలు ప్రకారమే పనులు చేస్తున్నట్లు వారు ఆరోపించారని, ఎలాంటి అసత్య ప్రచారాలు చేస్తే బాగుండదని అన్నారు. అంతేకాకుండా ఇల్లు, భూములు కోల్పోయిన నిర్వాసితులు మైన మేము జీవనోపాధి కోసం మిషన్లు తీర్చుకొని ప్రైవేటు కంపెనీలలో లోడింగ్ పనులు చేస్తూ జీవనం గడుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కల్లా చలపతి మరియు మంగంపేట నాయకులు పలువు ప్రైవేట్ కంపెనీ నాయకులు మేనేజర్లు పాల్గొన్నారు.

## మండల అభివృద్దే ధ్యేయంగా పనిచేద్దాం

**- మండల మీట్‌లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం**

వరదయ్యపాలెం, మే 22, ప్రభాతవార్త



వరదయ్యపాలెం మండల అభివృద్దే ధ్యేయంగా పనిచేద్దామని మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్లు, వంతెనలు నిర్మాణ పనులపై ఎమ్మెల్యే ఆరా తీశారు. అలాగే స్థానిక రిపోర్టర్ నాగార్జున తండ్రి భౌతిక కాయానికి ఎమ్మెల్యే నివాళి అర్పించారు.

శుక్రవారం వరదయ్యపాలెం ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన సాదారణ సర్వ సభ్య సమావేశంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని ప్రసంగించారు. మండలంలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ప్రతిపాదనలు పంపించాలని, నిధులు మంజూరు చేసే బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వడ దెబ్బ వంటి సమస్యతో ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లు, సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గంలో పూర్తయిన గ్రామ సచివాలయ భవనాలు, ఆరోగ్య కేంద్రాలు, రైతు సేవా కేంద్ర భవనాలను వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతామని ఆయన తెలిపారు. అనంతరం శాఖల వారీగా తమ ప్రగతి నివేదికలను అధికారులు సభలో చదివి వినిపించారు. వరదయ్య పాలెం మండలంలో నిర్మాణ దశలో ఉన్న వంతెనలు, రోడ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఇంజనీరింగ్ ఉన్నతాధికారులకు సూచించారు. 20 లక్షల రూపాయలతో గోవర్ధన పురం వంతెన నిర్మాణం, రూ.3 కోట్లతో పాండూరు రోడ్డు నిర్మాణం, రూ.2.50 కోట్లతో తడా నుండి శ్రీ కాళహస్తి వరకు రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమైందని, వాటిని త్వరగా పూర్తి చేయాలని డీఈ, ఏఈలకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం వరదయ్యపాలెం మండలం పాండూరు ఒడ్డి పాలెం కు చెందిన ఆంధ్రజ్యోతి రిపోర్టర్ నాగార్జున తండ్రి చలపతి (84) పరమపదించారు.

సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మధ్యాహ్నం రిపోర్టర్ నాగార్జున స్వగ్రామానికి చేరుకొని ఆయన తండ్రి భౌతిక కాయానికి నివాళి అర్పించారు. అనంతరం రిపోర్టర్ నాగార్జున, అతని కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## విపత్తు నిర్వహణపై ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన

తిరుపతి విద్య, మే 22 ప్రభాతవార్త:




తిరుపతిలోని ఎన్‌సీసీ నగర్‌లో ఉన్న 5 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లకు విపత్తు నిర్వహణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్, చిత్తూరు జిల్లా రిటైర్డ్ అదనపు జాయింట్ కలెక్టర్ చంద్రమోళి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సైనిక శిక్షణతో పాటు పౌర పరిపాలన, ప్రజా సేవ, పాలనా వ్యవస్థలపై కూడా క్యాడెట్లకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రమోళి మాట్లాడుతూ, విపత్తుల సమయంలో సమన్వయం, ముందస్తు సన్నద్ధత, ప్రజలకు తక్షణ సహాయం అందించడం ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో 5 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లు వి.ఆర్. చంద్రమోళిని శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ఎన్‌సీసీ సిబ్బంది, క్యాడెట్లు పాల్గొన్నారు.

## ఎర్రచందనం కేసులో ఐదేళ్లు శిక్ష



**సత్యవేడు, మే 22 ప్రభాతవార్త:** ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో తమిళనాడు తిరువళ్లూరు జిల్లా అత్తంతాగేలికి చెందిన నిందితుడు ఆర్ముగం(56) ఐదేళ్ల కఠిన కారగార శిక్ష, మూడు లక్షల రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతి ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి తీర్పు వివరించినట్లు స్థానిక ఫారెస్టు రేంజర్ త్రినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సత్యవేడు రేంజ్ పరిధిలో 2016 సంవత్సరంలో నమోదైన ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఈ మేరకు తీర్పు వెలువడింది. సత్యవేడు అటవీశాఖ పరిధిలో 2016 ఆగస్టు 28వ తేదీ జంబుకేశ్వరపురం- రాజగుంట ప్రాంతంలో అటవీశాఖ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో తమిళనాడుకు చెందిన ఆర్ముగం అనే వ్యక్తిని టాటా వాహనంతో పట్టుకున్నారు. వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 27 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని వాటి బరువు సుమారు 792కిలోలుగా నమోదు చేయడంతో పాటు దీనిపై కేసు నమోదు చేశారు. తిరుపతిలోని ఎర్రచందనం స్మగ్లింగ్ ప్రత్యేక కోర్టులో కేసు విచారణ జరిగింది. విచారణ పూర్తికాగానే ఎర్రచందనం దుంగలను నిందితుడు ఆర్ముగం అక్రమంగా రవాణా చేసినట్టు దోషిగా తేలడంతో ప్రత్యేక న్యాయస్థానం ఐదు సంవత్సరాల కఠిన శిక్ష విధిస్తూ మూడు లక్షలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల పాటు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని కోర్టు పేర్కొంది. అటవీశాఖ అధికారులు ఎర్రచందనం అక్రమ రవాణా, అటవీ నేరాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఫారెస్టు రేంజర్‌త్రినాథ్‌రెడ్డి హెచ్చరించారు. అటవీ సంపద పరిరక్షణలో ప్రజలుకూడా సహకరించాలని, ఫారెస్టు రేంజ్ పరిధిలో ఎక్కడైనా ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న వెంటనే సమాచారం అందించాలన్నారు.

## రైతుల సౌకర్యం కోసమే రీ సర్వే

-జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వెంకటరత్నం

రామచంద్రాపురం, మే 22 ప్రభాతవార్త:



రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం భూములను రీ సర్వే చేయిస్తున్నట్లు జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వెంకటరత్నం అన్నారు. శుక్రవారం సికె పల్లిలో జరుగుతున్న రీ సర్వేని జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వాసుతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రీ సర్వే నిర్వహిస్తున్న సర్వేయర్లకు ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో రైతుల భూములకు ఖచ్చితమైన హద్దులు నిర్ణయించడం జరుగుతుందన్నారు. రైతులు సహకరించి తమ పొలాలను రీ సర్వే చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ తరుణ్, విలేజ్ సర్వేయర్లు వాణి, అశోక్, లోకేష్, శశికిరణ్ పాల్గొన్నారు.

## జన్మస్థ శివాలయాన్ని పరిశీలించిన ఆర్‌డిఓ

రామచంద్రాపురం, మే 22 ప్రభాతవార్త:



అనుప్పల్లి పంచాయతీ, రేకలచేను సమీపంలోని జన్మస్థల శివాలయాన్ని శుక్రవారం ఆర్‌డిఓ రామ్మోహన్ పరిశీలిం చారు. శివాలయం పునర్నిర్మాణంలో గ్రామస్థులు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. దీనిపై స్పందించిన ఆర్‌డిఓ వివిధ శాఖల అధికారులతో కలసి ఆలయానికి చేరుకున్నారు. ఇరువర్గాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇరువర్గాలు సమన్వయం పాటించాలని ఆయన సూచించారు. తన సిబ్బందితో కలసి ఆలయ ప్రాంగణంలో వెలసియున్న అక్కదేవతల గుడిని, నవగ్రహ క్షేత్రాన్ని, కళ్యాణ మండపాన్ని పరిశీలించారు. నివేధికను ఉన్నత స్థాయి అధికారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదన్ రావు, డిప్యూటీ తహశీల్దార్ అన్వర్ భాషా, జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వెంకటరత్నం, జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వాసు, మండల సర్వేయర్ తరుణ్, విలేజ్ సర్వేయర్ శశికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టండి.!

రామచంద్రాపురం, మే 22 ప్రభాతవార్త:




వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపిపి ఏ.వి.బ్రహ్మానందరెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు తమ అభివృద్ధి నివేధికలను శాఖల వారీగా సభకు చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పధకాలు పార్టీల కతీతంగా అర్హులందరికీ అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, వైస్‌ఎంపిపి లావణ్య చంద్రబాబు, ఎంపిడిఓ పులిరామ్‌సింగ్, ఎంపిటిసిలు జ్ఞానమ్మ, మంజుల సిద్దారెడ్డి, కృష్ణవేణమ్మ, కొట్టే చంద్రశేఖర్ రెడ్డి, రాజేష్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పేరుతో ఆక్రమణ యత్నమా!

తిరుపతిరూరల్, మే22 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం గాంధీపురంలో అంగన్‌వాడీ కేంద్రం పేరిట ఆక్రమణలు జరుగుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రానికనే సాకు చూపిస్తూ, మరోపక్క భేరాసాలు కుదిర్చుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అంగన్‌వాడీ భవన నిర్మాణానికి స్థలం కాపాడుతున్నట్లు చూపిస్తూ, వాస్తవానికి ఆ స్థలాన్ని కాజేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించిన స్థలం అయితే ఎందుకు ఇప్పటివరకు అధికారిక బోర్డు ఏర్పాటు చేయలేదు? బోర్డు లేకుండానే గది నిర్మాణం, ప్రహరీ గోడ పనులు ఎందుకు వేగంగా కొనసాగుతున్నాయి? ఈ నిర్మాణాలకు సంబంధిత శాఖల నుంచి సరైన అనుమతులు ఉన్నాయా! ప్రజల మాటల్లో చెప్పాలంటే, అంగన్‌వాడీ పేరిట ప్రహరీ, లోపల మరో కథ! అనే అనుమానం బలపడుతుంది. చిన్నారుల సంక్షేమం కోసం ఉండాల్సిన స్థలాన్ని వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగించే ప్రయత్నం జరుగుతుందని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పూర్తిస్థాయి విచారణ చేసి, నిజానిజాలు వెలికితీయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. కాలువ స్థలాన్ని ఆక్రమణ చేసినట్టుగా రెవెన్యూ అధికారులు కూడా నిర్ధారణ చేసినట్లు సమాచారం. కాలువలో ఎలాంటి నిర్మాణాలు చేయరాదని, అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని రెవెన్యూ అధికారులు ఆదేశించారు.

## తిరుపతి వ్యవసాయ పాలిటెక్నిక్‌లో డిప్లొమా ప్రవేశాలు

తిరుపతి విద్య, మే 22 ప్రభాతవార్త:



ఆచార్య ఎన్‌జి రంగ అగ్రికల్చరల్ యూనివర్సిటీ పరిధిలోని తిరుపతి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిప్లొమా ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రిక తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు వ్యవసాయ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా ఏఎన్‌జీఆర్‌ఏయూ అధికారిక వెబ్‌సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల సమర్పణకు 2026 మే 31 రాత్రి 12 గంటల వరకు గడువు ఉందన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.100, ఇతర వర్గాల వారికి రూ.800 నమోదు రుసుముగా నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం దరఖాస్తును ఆన్లైన్‌లో సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఆచరణాత్మక శిక్షణతో కూడిన బోధన అందిస్తున్నామని చెప్పారు. మరిన్ని వివరాలకు 08772249909, 8501880111 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## జీవ వైవిధ్యమే మన జీవన విధానం కావాలి

తిరుపతి విద్య, మే 22 ప్రభాతవార్త :



భూమిపై ఉన్న వివిధ జీవజాతులు ప్రకృతికి అందాన్ని తీసుకువస్తున్నాయని, పర్యావరణ పరిరక్షణ ద్వారానే జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవచ్చని వైల్డ్‌లైఫ్ రేంజర్ బి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డు ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా నేషనల్ గ్రీన్ కార్ప్స్, వేమన విజ్ఞాన కేంద్రం, విశ్వం విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన జీవ వైవిధ్య అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పోటీల్లో విజేతలకు విశ్వం విద్యా సంస్థల డైరెక్టర్ ఎన్. విశ్వచందన్ రెడ్డి, వేమన విజ్ఞాన కేంద్రం డైరెక్టర్ ఎం. నాగార్జున, జిల్లా ఎన్‌జీసీ సమన్వయకర్త జయకర్, జేవీవీ అధ్యక్షుడు రెడ్డప్ప, మునిలక్షి ్మ బహుమతులు అందజేశారు. పాఠశాల స్థాయిలో నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యతాభావం పెంపొందించడంలో ఎంతో దోహదపడతాయని తెలిపారు.

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 1,076 మంది గైర్హాజరు

తిరుపతి విద్య, మే 22 ప్రభాతవార్త:



తిరుపతి జిల్లాలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ప్రాంతీయ తనిఖీ అధికారి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరైనట్లు పేర్కొన్నారు. ఉదయం జరిగిన పరీక్షలకు మొత్తం 10,829 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, అందులో 10,248 మంది హాజరయ్యారని తెలిపారు. 581 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు వెల్లడించారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకుని నిబంధనలు పాటిస్తూ పరీక్షలు రాసినట్లు పేర్కొన్నారు.

## మద్దూరు కళ్యాణికి పీహెచ్‌డీ పట్టా ప్రదానం

తిరుపతి విద్య, మే 22 ప్రభాతవార్త:



ఎస్వీయూకు చెందిన రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని మద్దూరు కళ్యాణికు పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసినట్లు విశ్వవిద్యాలయం అధికారికంగా ప్రకటించింది. అమినో మరియు సల్ఫోనామిడో అనుసంధానిత అజోల్స్ సంశ్లేషణ, జీవపరమైన విశ్లేషణ అనే అంశంపై ఆమె సమర్పించిన పరిశోధన గ్రంథాన్ని విశ్వవిద్యాలయం నియమించిన పరీక్షకుల మండలి సమగ్రంగా పరిశీలించి ఆమోదించినట్లు తెలిపింది. పరీక్షకుల బృందం సానుకూల నివేదిక సమర్పించడంతో, రసాయన శాస్త్రంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టా ప్రదానానికి విశ్వవిద్యాలయం అంగీకరించింది. ఈ మేరకు పరీక్షల నియంత్రణాధికారి డా . బి . రాజమాణిక్యం అధికారిక ప్రకటన విడుదల చేశారు. మద్దూరు కళ్యాణి తన పరిశోధనను ప్రొఫెసర్ పద్మావతి పర్యవేక్షణలో విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, స్నేహితులు కళ్యాణిని అభినందించారు.

## గుంతలు పూడ్చిన తెలుగు తమ్ముళ్లు

**సత్యవేడు, మే 22 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా సత్యవేడు మండలం అలివేలుమంగాపురం(ఏఎంపురం) బస్టాప్ వద్ద ఏర్పడిన పలు గుంతలను స్థానిక టీడీపీ నాయకులు మరమ్మతులు పనులు చేశారు. వీఆర్ కండ్రిగ-టీపీ పాళెం మెయిన్‌రోడ్డు మార్గం పూర్తిగా ధ్వంసమై అధ్వానంగా మారింది. ఈ నేపథ్యంలో ఏఎం పురం బస్టాప్ వద్ద బావులను తలపించే గుంతలు ఏర్పడ్డాయి. వాహనాలు గ్రామంలో ఒక వెళ్లాలన్నా ప్రయాణికులు బస్సు ఎక్కడానికి ఇక్కడ వేచి ఉండా లన్న ఇబ్బందులు తప్పని స్థితి ఏర్పడింది. దీంతో ఏఎం పురం టీడీపీ నాయకులు గోపిరెడ్డి, కోటి తదితరులు వారి సొంత ప్రొక్లెన్ వాహనంతో శుక్రవారం బస్టాప్ వద్ద ఏర్పడిన గుంతలను పూడ్చి చదును చేయడంతో వాహనదారులకు, ప్రయాణికులకు కొంత వరకు ఇబ్బందులు తప్పింది.

**CHANGE OF SURNAME**

• I,YELLAMSETTY MADHURIMA (Old Name), R/at DNo: 9-3-1/PC4 , Postal Colony Tirupati Dt, AP, have changed my surname to YALLAMSETTY MADHURIMA. Henceforth, I Shall be known as YALLAMSETTY MADHURIMA W/o. YALLAMSETTY SIVA PRASAD. (New Name).

## అభివృద్ధి పనులకు సహకరించండి

**-జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ విజ్ఞప్తి**



సూళ్లూరుపేట, మే 22 ప్రభాతవార్త: నియోజకవర్గ పరిధిలోని పలు కీలక మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల వేగవంతం చేసేందుకు నిధులు మంజూరు చేయాలని స్థానిక శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గానికి సంబంధించిన పలు దీర్ఘకాలిక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా అటకానితిప్ప నుండి పెర్నాడు రోడ్డు నిర్మాణానికి సంబంధించి డజిపి ఎస్ సర్వే నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే సూళ్లూరుపేట టౌన్ పరిధిలోని రైల్వే అండర్ బ్రిడ్జ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా సూళ్లూరుపేటలోని అన్నా క్యాంటీన్ స్థలాన్ని మార్చాలని విజ్ఞప్తి చేశారు. వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందిగా మారిన మామిడి కాలువపై వెంటనే కాజ్ వే నిర్మించాలని, మిగిలిన అభివృద్ధి పనులకు తగిన నిధులు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సమర్పించిన వినతులపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ప్రజల అవసరాలకు పెద్దపీట వేస్తూ, ఈ పనులన్నింటికీ ప్రాధాన్యత క్రమంలో నిధులు మంజూరు చేసి త్వరితగతిన పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని ఎమ్మెల్యేకు జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు.

## అక్రమ గంజాయి అదుపునకు ప్రత్యేక చర్యలు : డిఎస్‌పి

సూళ్లూరుపేట, మే 22 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా వ్యాప్తంగా గంజాయి రవాణా, అమ్మకాలు మరియు వాడుకను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. సూళ్ళూరుపేట సర్కిల్ ఆఫీస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ ఎం.మురళీకృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. గతంలో గంజాయికి అలవాటు పడిన పాత కన్జ్యూమర్స్, అనుమానితులను గుర్తించి, వారికి తక్షణమే పరీక్షలు చేయడం కోసం జిల్లా ఎస్పీ ప్రత్యేక కిట్లను అందుబాటులోకి తెచ్చారని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కిట్లలో కొన్నింటిని నాయుడుపేట సబ్‌డివిజన్‌కు కేటాయించడం జరిగిందన్నారు.నాయుడుపేట, సూళ్ళూరుపేట, వెంకటగిరి పట్టణాలతో పాటు వాటి శివారు ప్రాంతాలు, అలాగే తమిళనాడు సరిహద్దులో ఉన్న తడ తదితర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరిగే వారిని గుర్తించి ఈ కిట్ల ద్వారా అప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏ రూపంలోనైనా గంజాయి తాగడం, రవాణా చేయడం లేదా అమ్మడం పూర్తిగా నిషేధమని, ఈ నిబంధనలను మీరితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ చెంచుబాబు హెచ్చరించారు. రాత్రి వేళల్లో మరియు పట్టణ, మండల శివారుల్లోని హాట్‌స్పాట్స్‌పై పోలీసులు గట్టి నిఘా ఉంచారని, ఇందు కోసం డ్రోన్ కెమెరాలను, ఈగిల్ సంస్థ ద్వారా వచ్చే సమాచారాన్ని మరియు ఈ ప్రత్యేక కిట్లను వాడుతూ గంజాయిని పూర్తిగా అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని డీఎస్పీ చెంచుబాబు స్పష్టం చేశారు.

## నిబద్ధత కలిగిన నాయకుని కోల్పోయాం : కాకాణి



సూళ్లూరుపేట, మే 22 ప్రభాతవార్త: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిబద్ధత కలిగిన మంచి యువ నాయకున్ని కోల్పోయిందని మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం సూళ్లూరుపేట లోఅకాల మరణం చెందిన దువ్వూరు మునిశేఖర్ రెడ్డి కుటుంబాన్ని ఆయన పరామర్శించి మునిశేఖర్ రెడ్డి పార్థివదేహానికి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, తిరుపతి ఎంపీ గురుమూర్తితో కలసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనిల్ కుమార్ రెడ్డి, వైయస్సార్సీపి రాష్ట్ర ప్రచార భాగం చెందిన కాకుమాని రాజశేఖర్, జెట్టి వేణు యాదవ్, చిలక యుగంధర్, బి. మోహన్ రెడ్డి,వి కృపాకర్ రెడ్డి,స్వామి రెడ్డి, వైసీపీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు

సూళ్లూరుపేట, మే 22 ప్రభాతవార్త: మండలంలో వేసవి కాలంలో ప్రజలకు మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలని స్థానిక ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతల పాటు భూగర్భ జలాలు,అడుగంటే పరిస్థితులు నెలకొనడంతో దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అవసరమైన చోట్ల బోర్లు వేయడంతో పాటు నీటి సరఫరాను కూడా చేయాలని కోరారు. మండలంలో అభివృద్ధి పనులు నిలిచి ఉన్న చోట త్వరితగతిన పనులనుపూర్తి చేసేందుకు ప్రయత్నాలు చేయాలని కోరారు.గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో అతిసారా వ్యాధి ప్రబలే అవకాశాలు రెండుగా ఉంటాయని దీని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో తహసిల్దార్ శైలకుమారి, ఎంపీడీవో మురళీకృష్ణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భూమి తీసుకున్నారు... నష్టపరిహారం ఇవ్వలేదు



వాకాడు, మే 22 ప్రభాతవార్త: వాకాడు మండలం రెడ్డిపాలెం బిట్ 1, 1476 సర్వే నెంబర్‌లో కేటాయించిన ఎకరా 3.18 భూమిని ప్రభుత్వం తన తండ్రి పేరు మీద పట్టా ఇవ్వడం జరిగిందని, అనధికారికంగా భూమిని తీసుకుని చెరువుగా మలుచుకుని తమ కుటుంబాన్ని నిరాశ్రయులు చేసారని ఆ వేదనతోనే తన తండ్రి మరణించారని ప్రస్తుతం తల్లి కూడా అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక నేతలు ఇబ్బందులు గురిచేస్తూ అడ్డుకుంటు న్నారని వాకాడు మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన షేక్ రిజ్వానా తెలియజేసింది. శుక్రవారం మండల కేంద్రమైన వాకాడు తహసిల్దార్ కార్యాలయం ఆవరణంలోని ఒక నెల ఒక నియోజకవర్గం 4 సార్లు ప్రభుత్వం కార్యక్రమంలోని భాగంగా ఆమె జాయింట్ కలెక్టర్‌కు అర్జీ ద్వారా ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్‌తో ఆమె బాధ ఆవేదనతో మాట్లాడుతూ వైద్యానికి భారీగా ఖర్చు అవుతుండడంతో ఒంటరి అయినా తన తల్లి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నష్టపోయిన తమ భూమికి ప్రత్యామ్నాయం భూమి లేదా నష్టపరిహారం అందేలా వెంటనే చర్యలు తీసుకోగలరు అని ఆమె తెలియజేశారు.

## మత్స్యకారులకు అవగాహన : మెరైన్ ఎస్ఐ

వాకాడు, మే 22 ప్రభాతవార్త: వాకాడు మండలం అంజిలాపురం గ్రామంలోని మత్స్యకారులకు మెరైన్ సబ్ ఇన్స్పెక్టర్ సౌమ్య ప్రియ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మత్స్యకారులతో మాట్లాడుతూ సముద్రంలో వేట నిషేధంతో ఉన్న మత్స్యకారులతో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు జీవన భృతి కింద ఒక్కొక్కరికి ఇరవై వేల రూపాయలు అందజేయడం జరిగిందన్నారు. జూన్ 15వ తేదీ వరకు వేట నిషేధం ఉందని ఆమె మత్స్యకారులకు తెలియజేశారు. ఈ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఏడుకొండలు, ఫిషరీష్ అసిస్టెంట్ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది, మెరైన్ సిబ్బంది, మత్స్యకారులు తదితరులు ఉన్నారు.

## ఓటర్ల జాబితా తయారీలో బిఎల్ఓలదే కీలక పాత్ర



వెంకటగిరి, మే 22 ప్రభాతవార్త : ఓటర్ల జాబితా తయారీలో బిఎల్ ఓ దే కీలక పాత్ర అని వైసిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. వైయస్సార్సీపి బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమం వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసం ఎన్‌జేఆర్ భవన్‌లో జరిగింది. ఓటర్ల జాబితా సవరణలలో బోగస్ ఓటర్లు, ఊర్లలో లేని ఓటర్లను తొలగించాలని తెలిపారు. పశ్చిమ బెంగాల్లో 90 లక్షల ఓట్ల వరకు తొలగించాలని తెలిపారు. ఇలా జరగకుండా అందరూ కీలకంగా వ్యవహరించాలని సూచించారు. ఇక వైఎస్ఆర్సిపి వాళ్ళని ఇబ్బంది పెట్టడం వాళ్లకు వెన్నతో పెట్టిన విద్య అని తెలిపారు. బిఎల్ఓ అనేది పదవి కాదని ఒక బాధ్యత అని తెలిపారు. తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ 20 నుండి 25 సంవత్సరాలకు ఒకసారి ఓటర్ల జాబితా సవరణ జరుగుతుందని తెలిపారు. అర్హుల ఓట్లు కాపాడుతూ అనర్హుల పేర్లు తొలగించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణలో బిఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలి అని సూచించారు. వైఎస్ఆర్సిపి హయాంలో కార్యకర్తలు ప్రజలకు నిస్వార్థ సేవలు అందించారన్నారు. టిడిపి కార్యకర్తలు తమ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. దొంగ ఓట్లు చేరినా అర్హుల ఓట్లు తొలగినా బాధ్యత బిఎల్ఏలదే అని స్పష్టం చేశారు. సమావేశం లోజోనల్ ఇంచార్జ్ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులే ఈసారి బిఎల్వోలు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి అబ్జర్వర్ కోడూరు కల్పలత, ఎస్సిసి సభ్యులు మధు రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి హరికృష్ణ, మండలాల కన్వీనర్లు ప్రసాద్ రెడ్డి, చింతల శ్రీనివాసులు రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, నాయకులు దశరధరామిరెడ్డి, సతీష్, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలి

వెంకటగిరి, మే 22 ప్రభాతవార్త: కార్మికులపై కక్ష సాధింపు చర్యలు వెంటనే ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డీపల్లి చంగయ్య. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో వెంకటగిరి మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావు తను డ్యూటీ చేసుకోకుండా యూనియన్ విషయాల్లో జోక్యం చేసుకుంటూ కావాలనే ఉద్దేశపూర్వకంగా యూనియన్ సభ్యులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. కక్ష సాగింపు చర్యల్లో భాగంగానే కక్ష గట్టి 7వ,వార్డు మరియు తొమ్మిదో వార్డుల్లో పని చేస్తున్నటువంటి కార్మికులను 20వ వార్డుకు మార్చడం జరిగిందని అన్నారు. అడిగితే శానిటరీ మేస్త్రిలు, శానిటరీ సెక్రటరీలు అందరూ కలిసి తీర్మానం చేసి మార్చడం జరిగిందని అన్నారు. కమిషనర్ వెంటనే జోక్యం చేసుకొని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న రామారావుపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు రిపోర్ట్ పంపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పెంచలయ్య, గోపాల్, మనీ, సాయి, ఇందరమ్మ, సుబ్బరత్నమ్మ, శేఖర్ పోలయ్య, శిరీష, కెవిపిఎస్ నాయకులు నారాయణ మహిళా సంఘం నాయకులు లక్ష్మి, జ్యోతి, గౌరమ్మ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో రోగులకు పాలు,పండ్లు పంపిణీ



శ్రీకాళహస్తి,మే 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి 47వ జన్మదిన సందర్భంగా పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు పాలు,పండ్లు, బ్రెడ్‌ను అందించారు. అన్నా క్యాంటిన్లలో నిరుపేదలకు భోజనం, అల్పాహారాన్ని నాయకులు సొమ్ములు చెల్లించి అందించారు. పట్టణంలోని మహిమాన్విత ఆలయాలైన సుబ్రమణ్యం స్వామి, వినాయక స్వామి ఆలయాల వద్ద మొక్కు తీర్చుకొనుటకు కొబ్బరి కాయలను కొట్టారు.గాలి గోపురం వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కాగా గిరినజన విభాగం,బిసిలచే చిన్నపిల్లల చేత ప్లకార్డులు పట్టించి సంబరాలు జరిపారు.సాంస్కృతిక విభాగం సారధ్యంలో ఎంఎల్ఏ జన్మదిన సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలను పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు, మార్కెటింగ్ కమిటి అధ్యక్షుడు రంగినేని చెంచయ్యనాయుడు,కాసరం రమేష్, కంఠా రమేష్, వాకచర్ల గురప్పశెట్టి, డిల్లిబాబు, బూడిదవాకం రేణుకమ్మ,రావిళ్ళ మునిరాజానాయుడు, అక్షింతల కృష్ణయాదవ్, సుమతి, చంద్రమ్మ, సుమతి, కుమారి, శ్రీలక్ష్మి, సరోజ, తులసి, దాక్షాయణి, సునీత, పద్మజ, గీతా, చంద్రకళ, ఊహ, అనిత, అనూష, రామచంద్రయ్య, రామకృష్ణయాదవ్, పేట బాలాజి,ఆర్ముగం, వంకాయల సిద్దులయ్య, గంగల పూడి హరి, ఎంపిశ్రీను, కోరారమేష్, వివేక్‌గౌడ్, కోలా సుబ్రమణ్యం, కటికం సుబ్రమణ్యం, వెంకట్‌గౌడ్, రాజు,పూల శేఖర్, శివకుమార్, బాలయ్య, అకుల సనీత, నున్నా అనూష, మహమ్మద్, రమేష్‌బాబు, సులేమాన్, వంశీకృష్ణ, టైలర్‌వాసు, శివ,హరి, తేజ, నాగమ్మ, మునికుమార్, చందు సాలారాఖాన్,జి.దశరధాచ్చారి, డాక్టర్ యం.ఉమేష్‌రావు, భీమాల భాస్కర్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, మణి, సులేమాన్, గంగనపల్లి రమేష్, కృష్ణమూర్తి, తుపాకుల ప్రసాద్, మారయ్య, మునెమ్మ, వెంకటరమణ, గంగమ్మ,రోజా,కొండ సతీష్, లక్ష్మీనారాయణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## మండల అభివృద్దే ధ్యేయంగా పనిచేద్దాం

**- మండల మీట్‌లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం**



వరదయ్యపాలెం, మే 22, ప్రభాతవార్త వరదయ్యపాలెం మండల అభివృద్దే ధ్యేయంగా పనిచేద్దామని మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్లు, వంతెనలు నిర్మాణ పనులపై ఎమ్మెల్యే ఆరా తీశారు. అలాగే స్థానిక రిపోర్టర్ నాగార్జున తండ్రి భౌతిక కాయానికి ఎమ్మెల్యే నివాళి అర్పించారు. శుక్రవారం వరదయ్యపాలెం ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన సాదారణ సర్వ సభ్య సమావేశంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని ప్రసంగించారు.మండలంలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ప్రతిపాదనలు పంపించాలని, నిధులు మంజూరు చేసే బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వడ దెబ్బ వంటి సమస్యతో ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లు, సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గంలో పూర్తయిన గ్రామ సచివాలయ భవనాలు, ఆరోగ్య కేంద్రాలు, రైతు సేవా కేంద్ర భవనాలను వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతామని ఆయన తెలిపారు. అనంతరం శాఖల వారీగా తమ ప్రగతి నివేదికలను అధికారులు సభలో చదివి వినిపించారు. వరదయ్య పాలెం మండలంలో నిర్మాణ దశలో ఉన్న వంతెనలు, రోడ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఇంజనీరింగ్ ఉన్నతాధికారులకు సూచించారు. 20 లక్షల రూపాయలతో గోవర్ధన పురం వంతెన నిర్మాణం, రూ.3 కోట్లతో పాందూరు రోడ్డు నిర్మాణం, రూ.2.50 కోట్లతో తడా నుండి శ్రీకాళహస్తి వరకు రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమైందని, వాటిని త్వరగా పూర్తి చేయాలని డీఈ, ఏఈలకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం వరదయ్యపాలెం మండలం పాండూరు ఒడ్డి పాలెం కు చెందిన ఆంధ్రజ్యోతి రిపోర్టర్ నాగార్జున తండ్రి చలపతి (84) పరమపదించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మధ్యాహ్నం రిపోర్టర్ నాగార్జున స్వగ్రామానికి చేరుకొని ఆయన తండ్రి భౌతిక కాయానికి నివాళి అర్పించారు. అనంతరం రిపోర్టర్ నాగార్జున, అతని కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## మహానాడు వేడుకలను విజయవంతం చేయండి

**ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**



పుత్తూరు, మే 22 ప్రభాతవార్త : ఈ నెల 27, 28 తేదీల్లో డిజిటల్ విధానంలో జరగనున్న మహానాడు వేడుకలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధారణంగా ప్రతి ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించే మహానాడు వేడుకలను ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా ఈ ఏడాది డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి క్లస్టర్ పరిధిలో నాయకులు, కార్యకర్తలు కలిసి డిజిటల్ మహానాడు వేడుకల్లో పాల్గొనాలని తెలిపారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ఇంటిపై పార్టీ జెండా ఎగురవేయాలని సూచించారు. మహిళలకు ఉచిత ఆర్టీసి బస్సు ప్రయాణం, రైతు భరోసా, పెన్షన్లు, ఉచిత వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలే కాకుండా రాజధాని అమరావతి నిర్మాణం, ఇతర అభివృద్ధి పథకాలను పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలన్నారు. డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నప్పటికీ ప్రతి కార్యకర్త కార్యక్రమంలో పాల్గొనే విధంగా నాయకులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్ కన్వీనర్లు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాలపై... వివిధ పార్టీల నాయకులతో సమావేశం



శ్రీకాళహస్తి,మే 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని ఆర్‌డిఓ కార్యాలయంలో శుక్రవారం వివిధ పార్టీల నాయకులు, అధికారులతో ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి ఓటర్ల జాబితాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ జారి చేసిన స్పెషల్ ఇన్‌సెంటివ్ రివిజన్ ఆఫ్ ఎలక్ట్రోరల్ ఫేస్ త్రి షెడ్యూల్‌ను జారి చేసారు.ఈ ముసాయిదా లను వివరించారు. నోటీసులోని వివరాలను ఆర్‌డిఓ వివరించారు.ఈ సందర్భంగా ఓటర్ల జాబితాల పరిశీలన సవరణ కు సహకరించాలని కోరారు. రాబోవు రోజుల్లో జరగబోవు ఎన్నికలను సజావుగా నిర్వహించుటకు ఓటర్ల జాబితాల సవరణ ఎంతో ముఖ్యమన్నారు.ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, తహశీల్దార్లు టివి సుబ్రమణ్యం, రాజశేఖర్, భారతిలతో పాటు కాంగ్రెస్ పార్టీ, జనసేన,సిపిఐ, సిపిఎం పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## గంజాయి విక్రయించిన, సేవించిన చర్యలు : సిఐ

వెంకటగిరి, మే 22 ప్రభాతవార్త: గంజాయి విక్రయించిన సేవించిన కఠిన చర్యలు తీసుకుంటామని వెంకటగిరి సీఐ ఎం రోశయ్య తెలిపారు. వెంకటగిరి సిఐ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. వెంకటగిరి పట్టణం మాసాపేటకు చెందిన పెనుబర్తి గణేష్ అలియాస్ నక్కల గణేష్ అరకు ప్రాంతం నుండి గంజాయి తీసుకొచ్చి సేవించడం విక్రయించడం చేస్తున్నందువల్ల అతనిపై పీడీ యాక్ట్ పెట్టినట్లు తెలిపారు. గంజాయి మత్తుకు బానిసై గణేష్ దొంగతనాలకు పాల్పడే వారిని తెలిపారు. ఇతను కడప సెంట్రల్ జైల్లో ఉన్నట్లు తెలిపారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో ఎవరైనా గంజాయి విక్రయించిన సేవించిన చర్యలు తీసుకుంటామన్నారు. మత్తు పదార్థాలు 100 ఫోన్ చేసి చలపాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోండి

వెంకటగిరి, మే 22 ప్రభాతవార్త: ఐటిఐలో 2026-27 సంవత్సరం గాను ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి చంగల్‌రాయన్ తెలిపారు. డ్రాఫ్స్ మెన్ సివిల్, ఎలక్ట్రిషన్, పిట్టర్, మెషినిస్టు, మెకానికల్ డీసెల్ రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషన్ టెక్నీషియన్ టర్నర్ కోర్సులో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు అర్హులు అని వివరించారు. జూన్ నెల 30వ తేదీ లోపల దరఖాస్తులు చేసుకోవాలి అని తెలిపారు. పూర్తి వివరాలు కోసం 9989520009, 8985 839981 సెల్ నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు కోసం సంప్రదించాలని వివరించారు.

## కరంటోళ్లు జన బాట కార్యక్రమం

బాలాయపల్లి, మే 22 ప్రభాతవార్త: మండలంలోని కడగుంట గ్రామంలో కరంటోళ్లు జన బాట కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ ఏఈ ఏడుకొండలు సిబ్బంది నిర్వహించారు. విద్యుత్ పరమైన సమస్యలు ఏమన్నా ఉంటే తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తాము అని తెలిపారు. వ్యవసాయం, గృహాలకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నట్లు వివరించారు. ప్రతి మంగళ, శుక్రవారం నాడు కరెంటోళ్లు జన బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## దువ్వూరు అకాల మరణం బాధాకరం : ఎంపీ

వెంకటగిరి, మే 22 ప్రభాతవార్త: వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ దువ్వూరు మునిశేఖర్ రెడ్డి అకాల మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఎంపీ గురుమూర్తి తెలిపారు. ఢిల్లీలో ఉన్న తనతో ప్రతి రోజు మధ్యాహ్నం ఫోన్ చేసి పలు అంశాల గురించి చర్చించే వారిని ఎంపీ తెలిపారు. పార్టీ పట్ల నిబద్ధతతో, ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ సేవలందించిన మునిశేఖర్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మహిళలే మహారాణులు

తడ,మే 22 ప్రభాతవార్త: మహిళలు అన్ని రంగాలలో నైపుణ్యం కలిగి ఉండాలని మహిళలకు కల్పించిన హక్కులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అంగన్వాడి సూపర్వైజర్ లక్ష్మీ నారాయణమ్మ మహిళలకు అవగాహన కల్పించారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బీవీ పాలెం అంగన్వాడి కేంద్ర నందు 11 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలలోపు కిశోరి బాలికలు నైపుణ్యం, ఆరోగ్యం, చట్టాలపై అవగాహన కల్పించారు మహిళలు అన్ని రంగాలలో రాణించాలని సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని ప్రభుత్వం మహిళల రక్షణకు కల్పిస్తున్న చట్టాలను వివరించారు.

## ప్రజా సమస్యలను నిలదీస్తే... పోలీసులతో నెట్టిస్తారా



వాకాడు, మే 22 ప్రభాతవార్త: గత క్లినిక్‌లో గాని, ప్రజా దర్బారులో గాని ప్రజా సమస్యలు మీద అర్జీలు ఇస్తే ఎన్ని పరిష్కారం చేశారని నిలదీసినందుకు పోలీసులతో నెట్టి ఇస్తారా ఇదేనా ప్రజాస్వామ్యం అంటూ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి రెవెన్యూ అధికారులపై మండిపడ్డాడు. శుక్రవారం మండల కేంద్రమైన వాకాడు తాసిల్దార్ కార్యాలయం ఆవరణలోని ఒకే నెల ఒకే నియోజవర్గం నాలుగు సందర్శనలు ప్రభుత్వ కార్యక్రమం మండల తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ రావడంతో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి కార్యక్రమంలో మాట్లాడుతూ గత రెండు సభల్లో ప్రజా సమస్యల మీద తాను అర్జీలు ఇచ్చి ఉన్నానని ఇప్పటివరకు పూర్తి కాలేదని, ఇలాంటి ప్రభుత్వ కార్యక్రమం జరుగుతూ ఉంటే ప్రజలకు తెలియజేయకపోవడం, జాయింట్ కలెక్టర్ పోలీసులతో నెట్టించాలని అనడంతో ఒక్కసారిగా అక్కడ పరిస్థితి మారింది. దీంతో పురుషోత్తరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ తాను కూటమి ప్రభుత్వంలో నాయకుడినని, నేను ప్రజా సమస్యల ఇచ్చినటువంటి అర్జీలను పరిష్కరించలేదని ప్రశ్నిస్తే నామీద పోలీసులుతో నెట్టించాలని చూసిన జాయింట్ కలెక్టర్ మీద, రెవెన్యూ అధికారులు మీద ప్రభుత్వం దృష్టికి నివేదికతో వెళ్తానన్నారు.

## నియోజకవర్గం నాలుగు సందర్శనలు కార్యక్రమం



వాకాడు, మే 22 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు ప్రతిష్టా త్మకంగా ప్రవేశపెట్టిన ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు కార్యక్రమంను గురువారం తిరుపతి జిల్లా, సూళ్ళూరుపేట రెవెన్యూ డివిజన్ నందు తహసిల్దారు, వాకాడు వారి కార్యాలయ ప్రాంగణం నందు జిల్లా జాయింట్ కలెక్టరు, తిరుపతి వారి అధ్యక్షతన నిర్వహించారు. సదరు కార్యక్రమానికి రెవెన్యూ డివిజనల్ అధికారి, సూళ్ళూరుపేట వారు, వాకాడు, చిట్టమూరు తహసిల్దార్లు, మండల అధికారులు, పాల్గొన్నారు. సదరు కార్యక్రమంలో వాకాడు మండలానికి సంబంధించి 19 అర్జీలు నమోదయ్యాయని తెలిపారు. గతంలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్ నందు వాకాడు మండలానికి సంబంధించి 131 అర్జీలు రాగా 123 అర్జీలు పరిష్కరించడమైనదని, చిట్టమూరు మండలానికి సంబంధించి 49 అర్జీలు రాగా 47 అర్జీలు పరిష్కరించడమైనదని తెలిపారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం: ఒకరు మృతి



పెళ్లకూరు, మే 22 ప్రభాతవార్త : నాయుడుపేట పూతలపట్టు జాతీయ రహదారిపై పెళ్ళకూరు గ్రామ సమీపానగల అండర్ బ్రిడ్జ్ ప్రాంతంలో ఆగి ఉన్న లారీని టాటా ట్రక్ వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరు వ్యక్తులకి గాయాలైన సంఘటన శుక్రవారం నాడు చోటు చేసుకుంది. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు చిత్తూరు జిల్లా పాకాల మండలం గానుగుపేట చిన్న పాపయ్యగారిపల్లి గ్రామానికి చెందిన యల్లం పూరి గోపి (48) తన కుమారుడు, మనవడితో కలిసి ట్రక్ వ్యాన్‌లో పాకాల నుండి గొర్రెలు తీసుకుని గూడూరు సంతకు వెళ్లి అక్కడి నుండి తిరిగి పాకాలకు వెళుతున్న క్రమంలో పెళ్ళకూరు వద్దకు రాగానే ఆగి ఉన్న లారీని వెనక నుండి ఢీకొనడంతో వాహనం నడుపుతున్న గోపి అక్కడికక్కడే మృతి చెందగా వెనక ట్రక్కులో ఉన్న కుమారుడు రాజు మనవడు వర్షన్‌లు గాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న పెళ్లకూరు పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతుడు శవాన్ని నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

## శ్రీ తిరుపతి గంగమ్మకు 52.36లక్షల ఆదాయం

**- హుండీ,దాతల ద్వారా 504గ్రా బంగారం,660గ్రా.ల వెండి**

**- గతేడాది కంటే పెరిగిన 12లక్షల ఆదాయం**



కుప్పం, మే 22 ప్రభాతవార్త: కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారి జాతర సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకల రూపంలో 52.36లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ ఛైర్మన్ బిఎ ంకె రవిచంద్రబాబు తెలిపారు. శుక్రవారం సైతం ఆలయ ప్రాంగణంలో ఇఓ రమణ, దేవదాయ శాఖ అధికారులు, కమిటీ సభ్యుల సమక్షంలో హుండీల నగదు లెక్కించారు. మొత్తం హుండీల ద్వారా రూ 52,36580ల నగదు లభించింది. అలాగే హుండీల ద్వారా 104గ్రా, దాతల ద్వారా 504గ్రాముల బంగారం వచ్చిందన్నారు. భక్తులు 660 గ్రాముల వెండిని అమ్మవారి హుండీల్లో మొక్కులుగా చెల్లించారు. కాగా గతేడాది కంటే ఈ దఫా అమ్మవారి ఆదాయం 12లక్షలు పెరిగిందని ఆలయ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు తెలిపారు. గతేడాది నగదు రూ 40లక్షలు కాగా ఈ ఏడాది 52లక్షలకు పెరిగిందన్నారు. అలాగే గతేడాది బంగారం 95గ్రా.లు రాగా ఈసారి 504గ్రా, వెండి గతేడాది 626గ్రా.లు రాగా ఈ సారి 660గ్రాములను భక్తులు అమ్మవారికి కానుకల రూపంలో సమర్పించారన్నారు.

# తిరుపతి డివిజన్

## పాతవీరాపురంలో ధర్మరాజుల స్వామి తిరునాళ్ళు

ఏర్పేడు, మే 22 ప్రభాతవార్త:



ఏర్పేడు మండలంలోని పాతవీరాపురం గ్రామంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల తిరునాళ్ళు ప్రారంభమైంది. ఈగ్రామంలో తిరు నాళ్ళను బ్రహ్మోత్సవాలుగా నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో 52వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పోతురాజు ఊరేగింపు నిర్వహించారు. పోతురాజు మాధవమాల, గుండ్రాళ్ళమిట్ట, మల్లవరం, ఇసుకు తాగేలి, గ్రామాల్లో ఉత్సవం నిర్వహించారు. మేళ తాళాలతో మంగళవాయిద్యాలతో గ్రామాల్లో ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాలను చైర్మెన్ కొంగర కృష్ణారెడ్డి, మాజీ జడ్‌పిటిసి మునిరంగారెడ్డి, మాజీ ఎంపిటిసి మునిరత్నం రెడ్డి, పాతగుంట గురువారెడ్డి, కావలి బాలాజి, కే అనంద్, కే. దోరస్వామి ఆలయ పూజారి రవి తదితరులు పాల్గొన్నారు.

## భీముని చెరువు వద్ద గుర్తు తెలియని శవం

పుత్తూరు రూరల్, మే 22 ప్రభాతవార్త:



పుత్తూరు మండలంలోని వేపగుంట క్రాస్ పీహెచ్‌సీ ఆస్పత్రి సమీపంలో గుర్తు తెలియని శవం ఉన్న సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.... మండలంలోని భీముని చెరువు గ్రామానికి చెందిన సుజాత తన గొర్రెలను మేపుటకు వేపగుంట క్రాస్ పీహెచ్‌సీ ఆస్పత్రి సమీపంలో గల సరళమ్మ బీడు భూమి పక్కన ఉన్న నక్కల చెరువుకు పోవు కాలువ వద్దకు వెళ్ళగా అక్కడ ఒక గుర్తు తెలియని మగ శవం గుర్తించింది. పుత్తూరు మండలం పరమేశ్వర మంగళం సచివాలయ సిబ్బందికి సమాచారం అందించడంతో వీఆర్‌వో నిఖిల్, జీఎంఎస్‌కే హిందూమతి వెంటనే వెళ్లిచూసి చుట్టు పక్కల వారిని విచారించగా ఊరు పేరు తెలియాల్సి ఉందని తెలిపారు. ఆయనకు సుమారు 45 నుంచి 50 వయసు ఉంటుందని తెలిపారు. ఈ విషయం పుత్తూరు పోలీసులకు తెలియడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఎస్‌ఐ ఫోన్ నెం.9440796728, ఏఎస్‌ఐ ఫోన్ నెం.9490272111కు సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

## కిషోర బాలికల వికాసంపై అవగాహన సదస్సు

విజయపురం, మే 22 ప్రభాతవార్త:



మండలంలోని ఆలపాకం పంచాయతీ పరిధిలో ఆలపాకం కండ్రిగ దళితవాడ అంగన్‌వాడీకేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ నగరి ప్రాజెక్టు అధికారిణి ఇందిరా ప్రియదర్శిని ఆదేశాల మేరకు కిషోర బాలికల వికాసంపై ఐసీడీఎస్ మండల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి మాట్లాడుతూ కిషోర బాలికల వికాసానికి తీసుకోవాల్సి న పలు సూచనలు, సలహాలను అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీకార్యకర్త సి. శాంతి, రాణి, పలువురు కిషోర బాలికలు పాల్గొన్నారు.

## రాహుకేతుదోష నివారణ పూజల్లో సమాచారశాఖ డైరెక్టర్

శ్రీకాళహస్తి, మే 22 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం రాష్ట్ర సమాచార మరియు పబ్లిక్ రిలేషన్స్ శాఖ డైరెక్టర్ విశ్వనాధన్ కుటుంబసభ్యులతో రాహుకేతుదోష నివారణ పూజలను జరిపించుకున్నారు. పూజలకు ఆయన కుటుంబసభ్యులతో రాగా దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఒ బికె వెంకటేశులు ఆదేశాలతో ఏపిఆర్ఓ రవి వేదపండితులతో స్వాగతం పలికారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు స్వామిఅమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## క్షేత్ర స్థల విశిష్ట బోర్డును తొలగించిన వారిపై చర్యలేవి

తిరుపతి హెల్త్, మే 22 ప్రభాతవార్త:



పాపవినాశనం క్షేత్రంలో టీటీడీ ద్వారా ఏర్పాటు చేయబడిన అమ్మవారి క్షేత్ర స్థల విశిష్టతను తెలిపే బోర్డును తొలగించి 20 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు సంబంధిత అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని స్థానిక వ్యాపారి రాధాకృష్ణ ప్రశ్నించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో చిన్నతంబితో కలిసి రాధాకృష్ణ మాట్లాడారు. గడిచిన 45 సంవత్సరాలుగా పాపవినాశనం ప్రాంతాన్ని నమ్ముకుని చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని చెప్పారు. అర్ధరాత్రిలో టీటీడీ, అటవీ శాఖ నిబంధనలకు విరుద్ధంగా జనరేటర్ ను తీసుకువచ్చి అమ్మవారి విశిష్టతను తెలుపుతూ టీటీడీ ఏర్పాటు చేసిన బరువైన ఇనుప బోర్డును కత్తిరించి అక్కడ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని ప్రయత్నం చేస్తుంటే, ఆ సమయంలో అక్కడే నిద్రిస్తున్న వ్యాపారులు వీడియోలను, ఫోటోలను తీయడం జరిగిందన్నారు. ఈ దుశ్చర్యపై టీటీడీ, అటవీ శాఖ అధికారులకు చెప్పిన ఇప్పటివరకు పట్టించుకోలేదన్నారు. ఈ బోర్డును బాబు, హేమంత్ కొంతమంది మనుషుల సహాయంతో తొలగించారన్న విషయం అందరికీ తెలుసు అన్నారు. అయితే చర్యలు తీసుకుంటామని పత్రికల్లో స్టేట్మెంట్ ఇచ్చిన ఎఫ్ఆర్ఓ సుదర్శన్ రెడ్డి ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. స్థానికంగా ఈ దుశ్చర్యను మీడియాకు అందించామని తమపై కక్షగట్టి అన్య మతస్తులతో పోలీసులు ఫిర్యాదు చేయించి అట్రాసిటీ కేసులు నమోదు చేయించారన్నారు. రాజారెడ్డి అనే వ్యక్తిపై కూడా ఉద్దేశపూర్వకంగానే ఎటువంటి సంబంధం లేని విషయాన్ని ఆపాదిస్తూ అట్రాసిటీ కేసులు పెట్టించడం జరిగిందన్నారు. పాపవినాశనంలో జరుగుతున్న ఈ అడ్డగోలు దోపిడీపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఇప్పటికైనా పట్టించుకుని, జరుగుతున్న అధికారుల అన్యాయ ప్రవర్తనను కట్టడి చేయాలని కోరుతున్నామన్నారు. అడవిని నమ్ముకుని బ్రతుకుతున్న ఎస్టీలను (నక్కల వారు) మనుషులుగా కూడా చూడకుండా, నోటితో ఎదుటివారికి చెప్పుకోలేని బూతులను గతంలో పోలీసు అధికారులు మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ సంపాదనకు తెరతీసిన అటవీ శాఖ అధికారులు పాపవినాశనంలో 60 నుంచి 70 తట్టలు పెట్టించి రోజువారి కలెక్షన్లు చేసుకుంటూ దండుకుంటున్నారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ తిరుమల పాపవినాశనంలో అటవీశాఖ అధికారుల దౌర్జన్య దోపిడీపై విచారించి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటూ వ్యాపారాలు చేసుకునే తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

విజయపురం, మే 22 ప్రభాతవార్త:



మండలంలో ఈ నెల 21 శుక్రవారం సాయంత్రం సంభవించిన గాలివానకు నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలు రైతులు డిమాండ్ చేస్తున్నారు. అరుకాలం కష్టించి పండించిన మామిడి దిగుబడి చేతికి వచ్చే సమయంలో గాలివానకు తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం నష్ట నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి ఏడాదిఏదో విధంగా మామిడి రైతులు నష్టాలను చెవి చేస్తున్నామని ఆవేదన చెందారు. ఒక ఏడాది దిగుబడి రాక మరో ఏడాది దిగుబడి వచ్చిన అకాల వర్షాలకు అధికంగా నష్టపోతు న్నామని అన్నారు. మండలంలోని కోసలనగరం, జంబాడ, పాత ఆర్కాడు, కేశవపురం, మహారాజపురం, శ్రీహరిపురం, మల్లారెడ్డి కండ్రిగ, నారపరాజు కండ్రిగ తదితర గ్రామాల పరిధిలో అధికంగా మామిడి రైతులు నష్టపోయామని తెలిపారు. అలాగే మామిడి చెట్లు నేలకొరిగాయని, కోసలనగరంలో రేకుల షెడ్డు ధ్వంసం అయిందని యజమాని తీవ్ర నష్టం కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## పుణ్యాలను కొల్లగొట్టుకునే అల్‌హిజ్జా మాసం: రేహాన్

శ్రీకాళహస్తి, మే 22 ప్రభాతవార్త:



ముస్లింలు పుణ్యాలను కొల్లుగొట్టుకునే రెండు మాసాలు రంజాన్, అల్‌హిజ్జా(బక్రీద్) అని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత ఆయన అల్ హిజ్జా మాసం గురించి వివరించారు. రంజాన్ మాసంలోని చివరి పది రోజుల్లో పుణ్యరాత్రుల కోసం అన్వేషిస్తూ అల్లాహ్ ధ్యానంలో గడిపే వారు బక్రీద్ మాసం మొదటి పది రోజులు పుణ్యాలను కొల్లగొట్టుకునే పవిత్ర దినాలని వివరించారు. ఈ పది రోజులు మహమ్మద్ ప్రవక్త ఎలా గడిపేవారో వివరించారు. ఈ పది రోజుల ఆరాధనకు ఒక ఆరాధనకు 700 రేట్లు పుణ్యాలు వస్తాయని వివరించారు. ఈ పది రోజులు మహమ్మద్ ప్రవక్త ఉపవాసదీక్షలు పాటించేవారన్నారు. ఖుర్బానీ అంటే త్యాజించటం, త్యాగం అని అర్థమన్నారు. ముస్లింలుగా జన్మించుటకు అవకాశం ఇచ్చిన అల్లాహ్ మూడు రకాల ఖుర్బానీలను వివరించారన్నారు. ప్రాణ, ధన, కోర్కెలను త్యజించాలని అల్లాహ్ ఆరాధనలో గడపాలని సూచించినట్లు వివరించారు. మనం ఏదీ తలుచుకున్నా జగరదని అల్లాహ్ ఏది ఆదేశిస్తే అదే జరుగుతుందనే సత్యాన్ని గుర్తించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బక్రీద్ రోజు ఆచరించాల్సిన విధి విధానాలను వివరించారు. బహూశా గురువారంఈదుల్ ఆజహ్ ప్రార్థనలు ఉంటాయని వివరించారు.

## డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

–జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్



తిరుపతి కలెక్టరేట్, మే 22 ప్రభాతవార్త:

తిరుచానూరు ఫ్లై ఓవర్ నుండి దామినేడు వరకు గల జాతీయ రహదారి పనుల్లో భాగంగా డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనీ జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు జాతీయ రహదారి 71 విస్తరణ పనుల్లో భాగంగా తిరుపతి రూరల్ మండలం సి మల్లవరం క్రాస్ నుండి దామినేడు హౌసింగ్ కాలనీ వరకు గల ప్రధాన సమస్య అయిన పేరూరు సప్లై ఛానల్ నిర్మాణ రామానుజపల్లి జాతీయ రహదారి నందు గల కాలనీ డ్రైనేజీ సమస్య, తిరుచానూరు ఫ్లైఓవర్ వద్ద నుండి దామినేడు హౌసింగ్ కాలనీ వరకు గల డ్రైనేజీ సమస్యపై ఆర్డబ్ల్యూఎస్, జిల్లా పంచాయతీ, మున్సిపల్ కార్పొరేషన్, తుడా, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ఎస్ వెంకటేశ్వర్.. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్డబ్ల్యూఎస్ ఈఈ, జిల్లా పంచాయతీ అధికారులను డ్రైనేజీ సమస్యల పరిష్కారం కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి వారంలోపు పంపాలని తెలిపారు. ప్రధానంగా జాతీయ రహదారి వెంబడి నివాసం ఉన్న స్థానికులకు డ్రైనేజ్ సమస్య ఉందని, జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా దీర్ఘకాలిక పరిష్కార దిశగా పనులను పూర్తి చేయుటకు నిధులను మందులు చేయడం జరుగుతుందని తెలిపారు. జాతీయ రహదారి వెంబడి నివాసం ఉన్న స్థానికులు పక్కా డ్రైనేజ్ సమస్య లేక జిల్లా కలెక్టర్ గారికి పలుమార్లు విన్నవించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఈ ఈ నరేంద్ర కుమార్, జిల్లా పంచాయతీ అధికారిని సుశీలాదేవి, ఇరిగేషన్ ఈ ఈ వెంకటేశ్వర ప్రసాద్, తుడా ఎస్ ఈ రవీంద్ర, కార్పొరేషన్ ఎస్ ఈ శ్యాంసుందర్.. తదితరులు పాల్గొన్నారు.

## నాగలాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో అధ్వాన పరిస్థితులు

–శుభ్రత లేక ప్రజలు ఇబ్బందులు –మరుగుదొడ్లు లేక మహిళలు ఇబ్బందులు

నాగలాపురం, మే 22 ప్రభాతవార్త:



నాగలాపురం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ అధ్వాన పరిస్థితుల్లో కొనసాగుతోంది. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చెత్తాచదారం పేరుకుపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా మహిళలకు సరైన మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతోవారుతీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజు వందలాది మంది ప్రయాణికులు ఈ బస్టాండ్‌ని వినియోగిస్తున్నప్పటికీ, అధికారులు శుభ్రతపై దృష్టి సారించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్‌లోని షాపుల నుంచి రెంట్లు మాత్రం క్రమం తప్పకుండా వసూలు చేస్తున్నా ఆర్టీసీ డిపో మేనేజర్, పరిసర ప్రాంతాల పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నాగలాపురం ఆర్టీసీ బస్టాండ్‌ని పరిశుభ్రంగా మార్చాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## స్వచ్ఛ భారత్ గ్రామీణ్ పై శిక్షణ

తడ, మే 22 ప్రభాతవార్త:




స్వచ్ఛభారత్ గ్రామీణ్ కార్యక్రమంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో కార్యాలయం నందు పంచాయతీ డెవలప్మెంట్ అధికారులకు అసిస్టెంట్ ఇంజనీర్లకు ఎంపీడీవో శేఖర్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు ఉపయోగించే విధంగా అవగాహన కల్పించాలని బహిరంగ మలమూత్ర విసర్జనను నిషేధించాలని టాయిలెట్ శుభ్రతపై గ్రామాలలో అవగాహన కల్పించాలని ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని వ్యర్థాల రీసైక్లింగ్ ప్రోత్సహించాలని పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడం కొరకు ప్రతి ఒక్కరు సహకరించే విధంగా చైతన్యం తీసుకురావాలని ఎంపీడీవో తెలియజేశారు. ప్లాస్టిక్ వేద్దాలను తిరిగి వినియోగంలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ రధాన్ని ప్రవేశపెట్టిందని ప్లాస్టిక్ వ్యర్థాలు తీసుకొని వాటికి బదులుగా గృహ వినియోగానికి అవసరమయ్యే వస్తువులు స్వచ్ఛ రథం ద్వారా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూఎస్ జై ప్రకాష్ అధికారులు పాల్గొన్నారు...

## నాగలాపురం మండలంలో సంరక్షణ పనులు

నాగలాపురం, మే 22 ప్రభాతవార్త:



ఎండలతో ఎండిపోయిన నేలపై వర్షపు చినుకులు పడితే ఎలా జీవం మేల్కొంటుందో.. ఇప్పుడు జలధార–జల హారతి పనులతో తిరుపతి జిల్లా నాగలాపురం మండల గ్రామాల్లో అదే దృశ్యం కనిపిస్తోంది. పూడికతీతో మళ్లీ ఊపిరి పీల్చుకుంటున్న కాలువులు, నిండు కుండలా మారే చెరువులు, పెరుగుతున్న భూగర్భ జలాలు రైతు జీవితాల్లో కొత్త ఆశల విత్తనాలు నాటుతున్నాయి. ప్రతి నీటి బొట్టును భవిష్యత్‌కి భద్రపరిచే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ పనులు గ్రామీణ ప్రాంతాలకు సాగునీరు, ఉపాధి, ఆనందాన్ని ఒక్కే సారి అందిస్తున్నాయని తెలియజేశారు. నాగలాపురం మండలంలో జలధార–జల హారతి కార్యక్రమాన్ని నాగలాపురం మేజర్ పంచాయతీలోని పంట పొలాలకు వెళ్లి ప్రధాన కాలువలను పూడికతీత పనులు ఉపాధిహామీ పథకం ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో తేజస్విని, ఏపీవో నేరుగా వెళ్లి పరిశీలించారు. ఈ కార్యక్రమం కింద రూ.1 కోటి 57 లక్షలు అంచనా వ్యయంతో 68పనులకు పరిపాలన ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 26 వ్యవసాయ నీటి పారుదల కాలువలు పునరుద్ధరణ 6 చెక్ డ్యాంల్లో పూడికతీత పనులు, 5 చెరువుల్లో పూడిక తీత, 5 కందిత కందకాల నిర్మాణం, 6 నీటి కుంటలో పూడికతీత పనులు చేపట్టనున్నారు. ఈ పనుల ద్వారా మండలంలోని 3262 ఎకరాలకు లబ్ధి కలగనుంది. నాగలాపురం మండలంలోని నాగలాపురం గ్రామ పంచాయతీలో 50 మంది ఉపాధిహామీ వేతన దారులతో వెయ్యి మీటర్ల పొడవు, 1.50 మీటర్ల వెడల్పు గల రఘురెడ్డి పొలం నుంచి సెల్వం పొలం వరకు పంట కాలువ పూడిక తీత పనిని, రూ.136021 అంచనా విలువతో చేపడుతున్నారు. పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టు నుంచి ఎర్ర చెరువు ద్వారా సాగు నీరు ఈ పంట కాలువ నుంచి రైతులకు వెళుతుంది. ఈ కార్యక్రమాన్ని నాగలాపురం మండల ఎంపీడీవో తేజస్విని, పీడీ మదిలేష్, ఏపీవో నేరుగా వెళ్లి పరిశీలించారు.

## రేపు యుపిఎస్సి సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష

–పరీక్ష నిర్వహణకు పగడ్బందీగా ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, మే 22 ప్రభాతవార్త :




ఈ నెల 24న జరగనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్ష–2026 ను ప్రశాంత వాతావరణం లో నిర్వహించడానికి పగడ్బందీ ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు యు పి ఎస్ సి సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్ష–2026 నిర్వహణపై అసిస్టెంట్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్లు, లైసన్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 24న ఆదివారం యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష –2026 నిర్వహించాం జరుగుతుందని, ఈ పరీక్షలకు జిల్లాలోని 10 పరీక్షా కేంద్రాలలో 5,096 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్షా కేంద్రాలలోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, వైర్లెస్ హెడ్‌సెట్స్ వంటి వస్తువులు అనుమతించబడవన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, యూపీఎస్సీ అబ్జర్వర్ న్యూఢిల్లీ జితేందర్ శర్మ, తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్, సెక్షన్ అధికారి, ఇతర సంబందిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దశరథ రామిరెడ్డికి ఘన సన్మానం

నాయుడుపేట, మే 22 ప్రభాతవార్త:



స్థానిక ఎస్విటి థియేటర్‌లో వైఎస్ఆర్సిపి నాయకులు కాంట్రాక్టర్ పాలూరు దశరథరామిరెడ్డి (రాము) జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్ఆర్సిపి సీని యర్ నాయకులు వేడిచర్ల ప్రద్యుమ్న కుమారెడ్డి కార్యాలయంలో గజపూల మాల తో శాలువాలతో ఆయనను సన్మానించి కేకును కట్ చేసి పలువురికి వైసిపి పార్టీ కార్యకర్తలకు అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బాలచెంగయ్య తన కుమార్తెతో కలిసి దశరధారమిరెడ్డికి ఆయన చిత్రపటాన్ని బహుమతిగా అందచేశారు. వీపీ కుమార్ రెడ్డి, దశరధారమిరెడ్డి జన్మదిన ఆశీస్సు లు అందుకున్నారు. మొదటగా ఆయన సొంత గ్రామమైన పెళ్లకూరు మండలం పాలచ్చురులో తమ అభిమానుల మధ్య కేకు కట్ చేసారు. అక్కడ నుండి నాయుడుపేటకు తన అభిమాన యువతతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాబిరెడ్డి, హరిరెడ్డి, సాయి రెడ్డి, నల్లబోతుల రామారావు, చాపల వెంకటేశ్వర్లు, శివ, చంద్ర రాజు, డాక్టర్ మస్తానయ్య, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. దశరథ అభిమానులు స్నేహితులు వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమాన యువత తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## శేష వాహనంపై శ్రీ సదాశివేశ్వర స్వామివారు

పుత్తూరు రూరల్, మే 22 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో వెలసిన శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా స్వామి, అమ్మవార్లను శేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం ఆలయంలో మూల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. అలాగే సాయంత్రం కూడా అభిషేకాలు చేశారు. రాత్రి విశేష పుష్పాలంకరణ విద్యుత్ దీపాలంకరణతో స్వామి, అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

## లక్ష్యం కోసం అంకితభావంతో పని చేయాలి

– షార్ డైరెక్టర్ పద్మ కుమార్

సూళ్లూరుపేట, మే 22, ప్రభాతవార్త

విద్యార్థులు తమ అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు అంకితభావంతో పనిచేయాలని షార్ డైరెక్టర్ఈ ఎస్ పద్మ కుమార్ అన్నారు. శుక్రవారం శ్రీహరికోటలోని బ్రహ్మ ప్రకాష్ హాల్లో నిర్వహించిన యువిక 2026 ముగింపు కార్యక్రమంలోఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మే 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించిన యువ శాస్త్రవేత్తల శిక్షణ కార్యక్రమం విజయవంతమైందాని చెప్పారు. ఈ సందర్భంగా యువిక కార్యక్రమంలోప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. డిడి ఎంఎస్ఏ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ వివిధ శాఖలకు చెందిన ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## ఆత్మ విశ్వాసం పెంపొందించడానికి కిషోర వికాసం

నాగలాపురం, మే 22 ప్రభాతవార్త:



బాలికల్లో ఆత్మ విశ్వాసం పెంపొందిం చడానికి కూటమి ప్రభుత్వం కిషోర వికాసం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు పిచ్చాటూరు సీడీపీవో సౌభాగ్యమ్మ ఆదేశాలతో శుక్రవారం నాగలాపురం పట్టణంలోని వినోభానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కిషోర వికాసంపై కౌమార బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని, ఇందులో భాగంగానే మే 1 తేదీ నుంచి 31 వరకు కిషోర వికాసంపై ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో కౌమార బాలికలకు అవగాహన కార్యక్రమాలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు, కిషోర బాల బాలికలు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా

పుత్తూరు రూరల్, మే 22 ప్రభాతవార్త:




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తు న్నామని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పుత్తూరు ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమితి సభ్యుడు ఎన్. శివ, ఏరియా కార్యదర్శి చంద్రబాబులు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కొంస ఏర్పాటైన ఏపీఎస్ఆర్టీసిని ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడం వల్ల సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, ప్రైవేటీకరణ వల్ల టికెట్ ధరలు అమాంతంపెరిగి, గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం నిలిచిపోయే ప్రమాదం ఉందని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు బాబు, సీపీఐ కార్యదర్శి మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నాగరాజు, ఏఐటీయూసీ అధ్యక్షులు గోపి, వెంకటరమణ, కృష్ణారెడ్డి, భాస్కర్, రవి, కైలాసం తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లకూరులో కిషోరి వికాసం

పెళ్లకూరు, మే 22, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం యుక్త వయసులో ఉన్న బాలబాలికలకు ఆర్థిక విషయాలపై అవగాహన కల్పించడం కోసం చేపట్టిన కార్యక్రమం కిషోరీ వికాసం ఈ కార్యక్రమం ద్వారా కిషోర బాల బాలికలకు డబ్బు విలువ, ఆదాయం వ్యయం ప్రణాళిక, అవసరాలు కోరికలు మధ్య తేడా భవిష్యత్తు అవసరాల కోసం ఆర్థిక ప్రణాళిక, వంటి విషయాలపై యువతీ యువకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని మండల కేంద్రమైన పెళ్లకూరు, పునబాక గ్రామాలలోని దళిత కాలనీలో శుక్రవారం నాడు సిడిపిఒ కె ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సాయి లక్ష్మితో పాటు అంగన్వాడీ సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## కొత్త ఓటర్ల నమోదు పక్రియలో నాణ్యత ఉండాలి

: జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్

**తిరుపతి కలెక్టరేట్, మే 22 ప్రభాతవార్త :**



ఎలక్షన్ కమిషనర్ వారి ఆదేశాలు మేరకు జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం నాణ్యతగా ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులు ను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, డిఆర్ఓ నరసింహులు తో కలిసి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై ఎర్రోస్‌కు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషనర్ వారి ఆదేశాలు మేరకు జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం నాణ్యతగా ఉండాలని సంబంధిత అధికారులు ను ఆదేశించారు. ప్రతి ఇంటింటి వెళ్లి ఇనుమరేషన్ ఫారం ఇవ్వాలన్నారు. బి ఎల్ఓలకు ఈఆర్ఓలు నుంచి శిక్షణ కార్యక్రమం జూన్ 5 వ తేదీ నుండి 14 వ తేదీ వరకు ఉంటుందన్నారు. బిఎల్ లు ప్రతి ఇంటింటినీ జూన్ 15 వ తేదీ నుండి జూలై 15వ తేదీ వరకు సందర్శించాలన్నారు. హేతుబద్ధీకరణ జాబితా జిల్లా నుంచి ప్రధాన ఎన్నికల అధికారికి పంపించడం జరుగుతుందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాను జూలై 21వ తేదీన ప్రచురించడం జరుగుతుందన్నారు. జూలై 21వ తేదీ నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు చేర్పులు మరియు మార్పులు ఉంటాయన్నారు. వచ్చిన మార్పులు చేర్పులు డిస్పోజల్ చేయుటకు జూలై 21వ తేదీ నుంచి సెప్టెంబర్ 18వ తేదీ వరకు సమయం ఉందన్నారు. తుది ఓటర్ల జాబితా ఆగస్టు 22 వ తేదీన ప్రచురించడం జరుగుతుందన్నారు. జిల్లాలో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కార్యక్రమమును విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చండి

-జిల్లా విద్యాశాఖ అధికారి కుమార్

***చిన్నగొట్టిగల్లు, మే 22 ప్రభాతవార్త :*** ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు కార్పొరేట్ కంటే మంచి భోదన జరుగుతున్నదని జిల్లా విద్యాశాఖధికారి కుమార్ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలంలో బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వాపాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్, తల్లికివందనం, డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్య భోదన, అందిస్తున్నమన్నారు. ఈ కార్యక్రమం సత్యనారాయణ, గోపినాథ్, టీడీపీ నాయకులు శివకుమార్‌లు మృదులదేవి, శివకుమార్, ప్రవీణ్, శ్రీరాములు, మధు, హేమంత్, తదితరులు పాల్గొన్నారు

## జగన్ రాజకీయ ముసుగులో ఫ్యాక్షనిస్టు

-తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్ గౌడ్

**తిరుపతి, మే 22 ప్రభాతవార్త:**



హత్యా రాజకీయాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ ముసుగులో ఉన్న ఫ్యాక్షనిస్టు అని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. సమాజంలో విద్వేషాలు, హింస, కక్ష రాజకీయాలను పెంచే గొడ్డలి పార్టీ రాష్ట్రానికి హానికరమని మండిపడ్డారు. రాష్ట్రంలో సిఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో శరవేగంగా అభివృద్ధి జరుగుతుంటే తట్టుకోలేక వ్యక్తిగత ఆరోపణలకు దిగుతున్నారని ఆనంద్ గౌడ్ అన్నారు. రెండేళ్ల పాలనలో విమర్శించడానికి ఒక్క అంశం కూడా దొరక్క చంద్రబాబుపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ లాంటి స్వభావం ఉన్న వ్యక్తులు వస్తారని ముందే గుర్తించి దర్శకుడు శంకర్ అపరిచితుడు సినిమా తీశారేమో అనిపిస్తోంది అంటూ ఎద్దేవా చేశారు. జగన్ చేసిన వ్యాఖ్యలతో రాజారెడ్డి దమనకాండ, నాటి చరిత్ర, వైఎస్ కుటుంబ రాజకీయ నేపథ్యం మొత్తం మళ్లీ చర్చకు వచ్చాయని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డికి హిందూ దేవుళ్లపై ఎందుకు కక్షో అర్థం కావడం లేదన్నారు. తిరుమల ఏడుకొండల అంశాన్ని ప్రస్తావిస్తూ, నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రజలు మరచిపోలేదన్నారు. ఆ వ్యాఖ్యలను తప్పుపట్టిన చంద్రబాబు వ్యాఖ్యలను ఇప్పుడు జగన్ వక్రీకరించి ప్రస్తావిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిని చంపింది జగన్ అని బొత్సనే చెప్పారని, రిలయన్స్ సంస్థలపై దాడులు చేయించి, మళ్లీ వాళ్లకు రాజ్యసభ ఇచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

## విమర్శలపై...అధిష్టానానికి సంజాయిషీ ఇచ్చిన థామస్ !

**తిరుపతి, మే 22 ప్రభాతవార్త:**



చిత్తూరు జిల్లా జి డి నెల్లూరు నియోజక వర్గం టిడిపి ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై పార్టీ అధిష్టానానికి సంజాయిషీ ఇచ్చారు. శుక్రవారం మంగళగిరిలోని కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ను కలసి వివరణ ఇచ్చారు. కొందరు మీడియా ప్రతినిధులు తన మాటలను వక్రీకరించారని చెప్పారు. భవిష్యత్తో జాగ్రత్తగా ఉంటామని హామీ ఇచ్చారు. తరువాత మీడియాకు తెలిపారు. గత మంగళవారం ఆయన చిత్తూరులో మీడియా సమావేశంలో మాట్లాడుతూ టీడీపీలో ఎస్సీ ఎమ్మెల్యేలను అణచి వేస్తున్నారని, రూ ఐదు లక్షలు ఇస్తేనే సర్వే సంస్థలు ర్యాంకులు ఇస్తారని ఆరోపించారు. తన నియోజక వర్గంలో ట్రాక్టర్ లో గ్రావెల్ తరలిస్తేనే మీడియా గగ్గోలు పెడుతుందని, చంద్రగిరి, నగరి నియోజక వర్గాలలో టిప్పర్లలో తరలించినా వార్తలు ఎందుకు రాయడం లేదని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్రంలో సంచలనంగా మారాయి. మీడియాలో వైరల్ అయ్యాయి. దీనితో పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, కార్య నిర్వాహక అధ్యక్షుడు లోకేష్ సీరియస్ అయ్యారు. తక్షణం ఆయన నుంచి సంజాయిషీ తీసుకోవాలని పల్లా శ్రీనివాస్ ను ఆదేశించారు. దీనితో శ్రీనివాస్ థామస్ ను కార్యాలయానికి పిలిచి జరిగిన విషయాలపై వివరణ కోరారు. కొన్ని పత్రికల వారు తనను రెచ్చగొట్టి జవాబులు రాబట్టి, వాటిని వక్రీకరించారని థామస్ చెప్పినట్టు తెలిసింది. ఏది ఏమైనా అధిష్ఠానం సిరియస్ గా ఉందని మరొకసారి పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్టు సమాచారం. అయితే తొలిసారి ఎమ్మెల్యే అయిన తాను పొరపాటు చేశానని, అయితే ఉద్దేశ్య పూర్వకంగా అనలేదని, భవిష్యత్తులో జాగ్రత్తగా ఉంటానని చెప్పినట్టు తెలిసింది. అనంతరం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆయనతో పాటు రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు, ఎస్సీ నాయకుడు గుండయ్య ఉన్నారు.

## ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వస్త్రాలు, ఫలసరుకులు, రొక్కం అందజేత

**వాకాడు, మే 22, ప్రభాతవార్త**

వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలో మాజీ సొసైటీ చైర్మన్ కొడవలూరు దామోదరరెడ్డి స్వగృహంలో వారి తండ్రిగారైన కీర్తిశేషులు కొడవలూరు రాధాకృష్ణారెడ్డి స్మృత్యర్థం ఆర్థికంగా వెనుకబడిన పదిహేను కుటుంబాలకు ఫలసరుకులు, కూరగాయలు, వస్త్రములు, పాదరక్షలు, గొడుగులు, రొక్కం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా అర్చక సలహా మండలి సభ్యుడు దీవి అనంతాచార్యులు మాట్లాడుతూ కీర్తిశేషులు కొడవలూరు రాధాకృష్ణారెడ్డి ఐదవ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు దామోదరరెడ్డి, వారి తండ్రి స్మృత్యర్థం ఎనభైవేల రూపాయల విలువ చేసే వస్త్రములు, ఫలసరుకులు, కూరగాయలు, రొక్కం, ఇద్దరు విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందజేయడం చాలా సంతోషకరమని ఈ సందర్భంగా వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. వైఖానస సంక్షేమ సంఘం నాయకులు వేదాంతం శ్రీనివాస యుగంధర్ మాట్లాడుతూ తండ్రికి ఉత్తమ గతులు లభించాలని ఇంతటి మహోన్నతమైన కార్యక్రమం చేయడం ముదావహమని, తదుపరి తరాలవారికి ఇది ఆదర్శం, ఆచరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో శేషాద్రి శర్మ, హేమంత్ కుమార్ శర్మ, శివకుమార్, నరేష్ శర్మ సాయిబాబు, శ్రీరామసేన సభ్యులు శేఖర్, వంశీ, పవన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ అభివృద్ధి పథకాలను

ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం చేయండి

-బిజెపి శ్రేణులకు యడ్యూరప్ప నిర్ధేశం

**తిరుపతి, మే 22 ప్రభాతవార్త:**



తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుపతికి విచ్చేసిన కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్పను బిజెపి నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి పద్మావతి అతిధి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం యడ్యూరప్ప ను ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం కల్పించాలని ఈ సందర్భంగా నాయకులకు యడ్యూరప్ప సూచించారు. ఈ కార్యక్రమంలోబిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడుగుండాల గోపీనాథ్‌రెడ్డి, బిజెపి నాయకులు లోక ప్రభాకర్ నాయుడు, ఎస్ మస్తాన్, అరుణ్ రాయల్, మిట్టపల్లి బ్రహ్మానంద రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ విద్యా దోపిడీని అరికట్టాలి!

తొట్టంబేడు, మే 22 ప్రభాతవార్త:



రీఛార్జ్ పద్ధతిలో ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలను మూసివేయాలని, విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, పేద, మధ్యతరగతి కుటుంబాలను దోచుకుంటున్న విద్యా మాఫియాపై చర్యలు తీసుకొని కట్టడి చేయాలని ఎఐయస్ ఎఫ్ డిమాండ్ చేసింది. విద్యను వ్యాపార కేంద్రంగా మారుస్తున్న కళాశాలలు, పాఠశాలలను కట్టడి చేయాలని ఆల్ ఇండియన్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు హాజరయ్యారు. అదేవిధంగా రీఛార్జ్ పద్ధతిలో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలను తక్షణమే మూసివేయాలి. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు శివ, పట్టణ కార్యదర్శి చైతు, చరణ్, సంతోష్ ,బోస్ తదితరు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి

**శ్రీకాళహస్తి మే 22 ప్రభాతవార్త:**




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రైవేటీకరణ ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీకాళహస్తి అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా ధర్నా నిర్వహించారు. ఏఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు కత్తి రవి ఏరియా కార్యదర్శి తొండు మల్లికార్జున్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ఏర్పాటైన ఆర్టీసీ ను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడం వల్ల సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ప్రైవేటీకరణ వల్ల టికెట్ ధరలు అమాంతం పెరిగి, గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం నిలిచిపోయే ప్రమాదం ఉంది. లాభం లేని రూట్లను ప్రైవేట్ ఆపరేటర్లు నడపలేనన్నారు. ఈ సిపిఐ పట్టణ కార్యదర్శి గోపి ఏఐటీయూసీ నాయకులు జనార్ధన్, తొన్నటి రమేష్, మురళి, పాండు, పుట్టయ్య, బాలాజీ, గణేష్, రాంప్రసాద్ రమేష్, సెక్యూరిటీ యూనియన్ గోపి తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం నాయకులచే మదరసాలో ప్రార్ధనలు

**తొట్టంబేడు, మే 22 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వహక కార్యదర్శి షాకీర్ అలీ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షాకీర్ అలి మాట్లాడుతూ ఎంఎల్ఏ పుట్టిన రోజే తన పుట్టినరోజు రావటం తన అదృష్టమన్నారు. సందర్భంగా నిరుపేద పిల్లలకు సేవ చేయడం తనకు సంతృప్తిగా ఉందని అన్నారు. నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు షేక్ షఫీ మాట్లాడుతూ ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి, షాకిర్ అలీ జన్మదినం సందర్భంగా ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని మదర్సా పిల్లలు దువా చేసి అల్లా దయవల్ల చల్లగా ఉండాలని ప్రార్థన చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వహక కార్యదర్శి షాకీర్ అలీ. నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు. షఫీ. నియోజకవర్గమైనటి అధికార ప్రతినిధి. జహీర్ నియోజకవర్గ మైనారిటీ ఉపాధ్యక్షులు. మీర్జా. షఫీ. మీర్జా. నియోజకవర్గ మైనార్టీ ప్రధాన కార్యదర్శి. మస్తాన్ నియోజకవర్గ మైనారిటీ కార్యదర్శి. మహమ్మద్ రఫీ జావిద్, దర్గా ప్రాంతానికి చెందిన సయ్యద్ అహమ్మద్, బాబా ఫరీద్, గుమ్మల్ల రాజేశ్వరరావు నాగేశ్వరరావు గరికపాటి రమేష్, ఉదయ భాస్కర్ లు షాకీర్ అలికి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## కార్వేటినగరం ఐటిఐకి ధరఖాస్తు చేసుకోండి

**కార్వేటినగరం, మే 22 ప్రభాతవార్త:**

కార్వేటినగరం ప్రభుత్వపారిశ్రామిక శిక్షణాసంస్థ నందు 2026-27 సంవత్సరములకు గాను వివిధ ట్రేడులలో మొదటిదశ ప్రవేశమునకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిఐ ప్రిన్సిపల్ కె. ఆనంద్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 30-06-2026 తేది లోపు కార్వేటినగరం ప్రభుత్వ ఐటిఐనందు ధరఖాస్తు చేసుకోగలరన్నారు. ఇతర వివరముల కొరకు పోన్ నెంబర్లు: 9533288294, 949072623లకు సంప్రదించాలన్నారు.

## పుట్ పాత్ లపై దుకాణాలు తొలగించండి!

-డిప్యూటీ కమిషనర్ అమరయ్య

**తిరుపతి కార్పొరేషన్, మే 22 ప్రభాతవార్త:**



అలిపిరి పరిసరాల్లో భక్తులకు, వాహన చోదకులకు ఇబ్బందికరంగా పుట్ పాత్ లపై ఉన్న దుకాణాలను తొలగించాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య అధికారులు, వ్యాపారస్థులకు సూచించారు. భక్తులు, వాహన చోదకుల పిర్యాదు మేరకు ఏ ఎస్పీ రవి మనోహరాచారి, పోలీస్, నగరపాలక సంస్థ అధికారులతో కలసి అలిపిరి పరిసర ప్రాంతాల్లో పుట్ పాత్ పై ఉన్న వ్యాపారస్థులతో మాట్లాడారు. పుట్ పాత్‌పై వ్యాపారాలు చేయడం వలన ప్రజలతో పాటు భక్తులకు తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. అలాగే టిఫిన్ షాప్, దుకాణాల వ్యర్థాలు జూ పార్కు రోడ్డు పక్కనే వేయడంతో వన్యమృగాలు వస్తున్నాయని తెలిపారు. కావున ఇక్కడ ఇబ్బందికరంగా ఉన్న దుకాణాలను ఇక్కడ నుండి తొలగించాలని, లేకుంటే మేమే తొలగించడం జరిగితుందని హెచ్చరించారు. డిప్యూటీ కమిషనర్ వెంట డి ఎస్పీ లు కొండయ్య నాయుడు, భక్తవత్సలం, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, సి ఐ లు రామ కృష్ణ, రామ్ కిషోర్, ఏసీపీ పార్వతి ప్రియ, పోలీస్, హెల్త్, పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది ఉన్నారు.

## విద్యా కార్యక్రమాల అమలుపై అధికారులకు శిక్షణ

**తిరుపతి విద్య, మే 22 ప్రభాతవార్త:**




జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన డిప్యూటీ విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారుల కోసం నిర్వహించిన అవగాహన శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ శిక్షణలో వ్యక్తిగత అనుకూల అభ్యాస విధానం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, బోధనా పర్యవేక్షణ సాధనం అమలు, పర్యవేక్షణ విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు శామ్యూల్ మాట్లాడుతూ, సాంకేతిక ఆధారిత విద్యా విధానాలు విద్యా ప్రమాణాల పెంపులో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. వ్యక్తిగత అనుకూల అభ్యాస విధానం ద్వారా విద్యార్థుల వ్యక్తిగత అభ్యాస అవసరాలను గుర్తించి వారి నేర్చుకునే సామర్థ్యాన్ని మెరుగుపరచవచ్చన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి కెవిన్ కుమార్ మాట్లాడుతూ, పాఠశాల స్థాయిలో సమర్థవంతమైన పర్యవేక్షణ ద్వారా ప్రభుత్వ విద్యా కార్యక్రమాలు మరింత ఫలితాలనిస్తాయని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం వల్ల విద్యార్థుల హాజరు శాతం, ఆరోగ్య పరిస్థితులు మెరుగుపడుతున్నాయని చెప్పారు. ప్రతి మండల విద్యాశాఖ అధికారి, డిప్యూటీ విద్యాశాఖ అధికారి తమ పరిధిలోని పాఠశాలలను తరచూ పరిశీలిస్తూ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యక్తిగత అనుకూల అభ్యాస విధానం జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఎ. సుధాకర్, ఏఎంఓ చంద్రశేఖర్ నాయుడు, సీఎంఓ సురేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

కేవీబీ పురం, మే 22 ప్రభాతవార్త:

మండలంలోని రాయపేడుకి చెందిన టీడీపీ నాయకుడు, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ సభ్యుడు బాలకృష్ణారెడ్డి 21వ వర్ధంతిని ఆయన కుమారులు ఘనంగా నిర్వహించారు. కేవీబీ పురం ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, చెంచు మోహన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, వైద్యాధికారి రామ్‌నాయక్ తదితరుల ఉపాల్గొన్నారు.

## రెండు మోటారు బైక్‌లు ఢీ-గర్భవతికి తీవ్ర గాయాలు

కేవీబీ పురం, మే 22 ప్రభాతవార్త:



రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా... మండలంలోని పాతపాళెంకు చెందిన జనార్ధన్, నీలావతి ఇద్దరు శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యం కోసం వెళ్లి తిరుగు ప్రయాణంలో బైక్‌లో ఇంటికి వస్తుండగా మండలంలోని బైరాజు కండ్రిగ వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో జనార్ధన్‌కి స్వల్ప గాయాలు కాగా భార్య నీలావతికి స్వల్ప గాయాలు కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. గర్భవతిని వెంటనే ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఎదురుగా వచ్చిన బైక్ నిందితులు మండలంలోని పూడి గ్రామానికి చెందినట్లు తెలిసిందన్నారు. వాళ్ళకు కూడా స్వల్ప గాయాలు కాగా 108 ద్వారా శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. గర్భవతి మామ మునిరాజా కేవీబీపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## వైకాపా నాయకుని పరామర్శించిన బియ్యపు

**శ్రీకాళహస్తి, మే 22 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి పట్టణంలోని 9వ వార్డులో సీనియర్ వైకాపా నాయకుడు వెంకటేశ్వర్లును శుక్రవారం మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి పరామర్శించారు. వవెంకటేశ్వర్లు ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. అలాగే ఆయన కుటుంబానికి భరోసా ఇచ్చారు. త్వరగా కోలుకుంటారని రాబోవు ఎన్నికల్లో పార్టీ తరఫున పని చేయాలని ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరుతారక శ్రీనివాసులు, పఠాన్ ఫరీద్‌ఖాన్, గఫూర్, బాలిశెట్టి శేఖర్, ప్రమీలమ్మ, అర్కాట్ శేఖర్, మున్నా రాయల్, సురేష్, కొళ్ళూరు హరినాయుడు, పెరుమాళ్ చౌదరి, కుమార్, జివికే రెడ్డి శంషాద్, సోని తదితరులు పాల్గొన్నారు.

## గుడిమల్లం ఆలయం వద్ద అన్నదానం

ఏర్పేడు, మే 22 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం గుడిమల్లం ఆలయం వద్ద శుక్రవారం ధర్మకర్తల మండలి చైర్మెన్ బత్తల గిరిబాబునాయుడు సారధ్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా ఆలయానికి వచ్చిన వందలాది మంది భక్తులకు చక్కటి భోజనం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా గిరినాయుడు మాట్లాడుతూ ఎంతో కాలంగా కుంబాభిషేకానికి నోచుకొని ఆలయానికి కుంబాభిషేకం నిర్వహించుటకు ఎంఎల్ఏ సహాకారం ఎంతో ఉందన్నారు. అంతేకాక ఆలయాన్ని ప్రపంచంలోని దేశాలకు తెలియజేయటానికి కేంద్రంలోని సమాచార శాఖతో ఎంఎల్ఏ సమన్వయం చేస్తున్నారని వివరించారు. అన్నదాన కార్యక్రమంలో ఇఓ మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ముళ్ళపూడి గిరిజన కాలనీలో అన్నదానం

శ్రీకాళహస్తిరూరల్, మే 22 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి మండలం ముళ్ళపూడి గిరిజన కాలనీలో శుక్రవారం శాసన సభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి 47వ జన్మదిన సందర్భంగా సామాజిక కార్యక్రమాలను మండల పార్టీ అధ్యక్షుడు అక్షింతల కృష్ణయాదవ్ సారధ్యంలో ఏర్పాటు చేసారు. గిరిజనుల సమక్షంలో కేక్‌కట్ చేసారు. అలాగే వారికి అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జడ్‌పిటిసి సుబ్బారెడ్డి, శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెటింగ్ కమిటి అధ్యక్షుడు రంగినేని చెంచయ్యనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి బత్తిరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కామేష్‌యాదవ్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు తాటిపర్తి రవీంద్రారెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, పార్టీ సీనియర్‌నాయకులు బొల్లినేని జగన్నాధం నాయుడు రేవిళ్ళ రమేష్, బత్తియాదవ్, సుబ్రమణ్యం, నాయుడు, దొరైరా జారెడ్డిచరణ్, సతీష్, తెలుగుయువత అధ్యక్షుడు చరణ్‌రాయల్, తిరుపాలు, కృష్ణనాయుడు, మునిరెడ్డి, సుదర్శనం రెడ్డి, శివ, ఎర్రిరమేష్, తదితరులు పాల్గొన్నారు.

## టైలర్స్ అసోసియేషన్ సారధ్యంలో సంబరాలు

**తొట్టంబేడు, మే 22 ప్రభాతవార్త:**



మండలంలోని టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తొట్టంబేటి బాలయ్య సారధ్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాలను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా పెద్ద కేక్ ఏర్పాటు చేసి కట్ చేసారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధితో పాటు మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఈ సందర్భంగా మండల ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. బాలయ్య సభ్యులుపోలూరు శ్రీనివాసులుంరెడ్డి, చెంగయ్య, రమేష్, చరణ్, శ్రీనివాసులు, వాసు, బత్తెయ్య, చంద్రబత్తయ్య, రాంబాబు, గోపి, భాస్కర్‌మునెయ్య, మహేష్, గంగాధరం, అస్లంసంఘనాయకులుపాల్గొన్నారు

## ఇంటర్ విద్యాసంస్థలో పదోన్నతులు

శ్రీకాళహస్తి, మే 22 ప్రభాతవార్త:



ఉమ్మడి చిత్తూరుజిల్లా ఇంటర్ విద్యాశాఖలో దీర్ఘకాలంగా పదోన్నతులకు నోచుకొని సిబ్బందికి పదోన్నతులు లభించిన సందర్భంగా వారిని సత్కరించారు. ఈ శాఖలో అటెండర్ నుంచి రికార్డ్ అసిస్టెంట్‌గా పలువురు పదోన్నతులు పొందారు. ఈ సందర్భంగా సంఘా ధ్యక్షుడు కందాటి విశ్వేశ్వరరెడ్డి సారధ్యంలో పదోన్నుతులు పొందిన సిబ్బందిని సత్కరించారు. ఎన్నో పోరాటాల తరువాత వారికి అవకాశం లభించటం అందుకు ఉన్నతాధికారుల సహాకారం ఎంతో చెప్పుకోదగినదన్నారు. ఈ నేపధ్యంలో వెంకటాచలపతి, వెంకట సిద్దులు, చిన్నగొట్టికల్లు, కీర్తికుమార్, పద్మావతి, వవెంకటరమణ, భానుచందర్, దాక్షాయిణి, సుజాతలను సంఘం తరఫున సత్కరించారు.

## డ్రైనేజి కాలువకు శాశ్వత పరిష్కారం చూపండి



**కార్వేటినగరం, మే 22 ప్రభాతవార్త:** కార్వేటినగరంలో డ్రైనేజి సమస్య తీవ్రరూపం దాల్చుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని పలువురు వాపోతున్నారు. కార్వేటినగరం కాశాతోటవీధి వినాయకుని గుడి సమీపంలో డ్రైనేజి కాలువకు అడ్డంగ చెట్టువేర్లు రావడంతో మురుగునీరు ప్రవశించడం లేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు విపరీతంగా వృద్ధి చెంది జ్వరాలు బారిన పడుతున్నారు. దోమల తాకిడికి తట్టుకోలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నట్లు చెబుతున్నారు. కాగా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాల్సి వుంది.